రేపు నారా చంద్రబాబు నాయుడు 75వ పుట్టినరోజు



ఆయన తండ్రి నాయకుడు కాదు. ఆ కుటుంబానికీ రాజకీయ నేపథ్యం లేదు. కూడబెట్టి పేర్చిన కోట్ల సంపదా లేదు. అయినా.. అతను నాయకుడయ్యాడు. అంచె లంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రి అయ్యాడు. ఏపీ అభివృద్ధికి తనే ఒక సంకేతంలా మారాడు. ఇదంతా రాత్రికి రాత్రి జరిగిన మాయ కాదు. ఒక సాధారణ రైతుబిడ్డ దేశ రాజకీయాల్లోనే కీలక భూమిక పోషించే స్థాయికి చేరుకోవడం వెనుక చాలా ఉంది. చంద్రగిరి బడి నుంచి ఎస్వీయూనివర్సిటీ పీహెచ్‌డీ పరిశోధన దాకా సాగిన ప్రయాణం ఉంది. ఈ ప్రయాణంలో అల్లరీ ఆటలూ, ఎన్నికలూ పోరాటాలూ, కలలూ సవాళ్లూ మానవీయ స్పందనలూ ఉన్నాయి. బడిలో, కాలేజీలో, యూనివర్సిటీలో, కుటుంబంలో నారా చంద్రబాబు నాయుడుకు అత్యంత సన్నిహితంగా ఉన్నవారి మాటల్లోంచి ఏరుకున్న విశేషాలు ఇవి.. కుప్పం ఆరాధ్య నాయకుడు, నారావారిపల్లె ముద్దుబిడ్డ రేపు 75వ పుట్టినరోజు జరుపుకోబోతున్న సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేకం...

- 8వ పేజీలో

నేటి నుంచి 'ఆంధ్రజ్యోతి- ఐఆర్‌ఎంఎస్'
ఎడ్యుకేషన్ ఎక్స్‌పో



ఎడ్యుకేషన్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేస్తున్న స్టాళ్లు

తిరుపతి(విద్య/రూరల్), ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఆంధ్రజ్యోతి- ఐఆర్‌ఎంఎస్ (ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్) సంయుక్త ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ఎడ్యుకేషన్ ఎక్స్‌పో జరగనుంది. ఎయిర్‌బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాలులో ఉదయం 10.30 నుంచి రాత్రి 7గంటల దాకా కొనసాగుతుంది. దక్షిణ భారతదేశంలోని 30 ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, కన్సల్టెన్సీ ఏజెన్సీలు ఎక్స్‌పోలో పాల్గొంటున్నాయి. ఇంటర్మీడియట్ లేదా ప్రీడిగ్రీ తర్వాత ఏ కోర్సు చేయాలనే సందిగ్ధంలో ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ ఎక్స్‌పోను సందర్శిస్తే తగిన అవగాహన కలుగుతుంది. ఆయా విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, కోర్సుల వ్యవధి, వాటి ఫీజులు తదితర వివరాలతోపాటు విదేశీ విద్యకు సంబంధించిన సమాచారం కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఎక్స్‌పోను సందర్శించడానికి, సమాచారం పొందడానికి, అడ్మిషన్ల ప్రక్రియకు ఎలాంటి రుసుం లేదు. ఏకకాలంలో దక్షిణ భారతదేశంలోని ఇన్ని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలను ఒకే వేదికపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. జిల్లాతో పాటు నగరంలోని విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. గతంలోనూ ఈ ఎక్స్‌పోను 'ఆంధ్రజ్యోతి' విజయవంతంగా నిర్వహించింది. దీనికి జిల్లాలో అపూర్వ స్పందన కూడా లభించింది.

21 నుంచి ఎస్వీయూలో పనివేళల మార్పు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత దృష్ట్యా ఎస్వీ యూనివర్సిటీలోని అన్ని కార్యాలయాలకు పనివేళలు మారుస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పనివేళలు ఉండేవి. దాన్ని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ మార్చారు. సోమవారం నుంచి మారిన పనివేళలు అమలు కానున్నాయి. మే 31వ తేదీ వరకు ఈ కొత్త విధానం అమలు కానుంది. ఈ మేరకు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

'ఈ-వేస్ట్' ఉందా?

- సేకరణకు కేంద్రాలకు తీసుకురండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): 'మీ దగ్గర 'ఈ- వేస్ట్' ఉంటే సేకరణ కేంద్రాలకు తీసుకురండి. పర్యావరణ హితానికి ఈ-వేస్ట్ నివారణకు అందరూ భాగస్వాములు కావాలి' అని జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 'సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నిత్యజీవితంలో మొబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు భాగమయ్యాయి. అదే విధంగా పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులూ పెరుగుతున్నాయి. ఈ-వేస్ట్ ద్వారా మట్టి, నీరు, గాలి కలుషితమవుతుంది. అందుకని మండలకేంద్రం, 10వేలు పైబడిన జనాభా ఉన్న ప్రతి పంచాయతీలో శనివారం ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇళ్ల వద్దకు చెత్త సేకరణకు వచ్చే హరిత రాయబారులకు పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను అందజేయండి. లేకుంటే గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ కేంద్రాల వద్ద కూడా అందించవచ్చు. సేకరించిన ఈ-వేస్ట్‌ను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేయనున్నాం' అని ఆ ప్రకటనలో డీపీవో పేర్కొన్నారు.

16వ ఆర్థిక కమిషన్‌కు సాదర వీడ్కోలు

రేణిగుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం 16వ ఆర్థిక కమిషన్ చైర్మన్, సభ్యులకు సాదర వీడ్కోలు లభించింది. రెండు రోజుల పర్యటన ముగించుకొని కమిషన్ చైర్మన్ అరవింద్ పనగారియా, సభ్యులు అన్నే జార్జ్ మ్యాథ్యూ, మనోజ్ పాండా, రిత్విక్ పాండే, అమృత, ఆదిత్యపంత్ తదితరులు విమానాశ్రయం చేరుకున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రిన్సిపల్ సెక్రెటరీ పియూష్ కుమార్ (ఫైనాన్స్), కలెక్టర్ వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. అంతకుముందుగా విమానాశ్రయం వీఐపీ లాంజ్‌లో కమిషన్ చైర్మన్ అరవింద్ పనగారియా, సభ్యులకు శ్రీకాళహస్తి కలంకారి కాన్వాస్‌ను బహూకరించారు.



పనగారియాకు కలంకారీ డిజైన్ అందజేస్తున్న మంత్రి పయ్యావుల

15 నిమిషాల్లోనే..

- ఆత్మహత్యకు యత్నిస్తున్న మెడికోను కాపాడిన ట్రైనీ ఐపీఎస్



మెడికోతో ట్రైనీ ఐపీఎస్ హేమంత్

తిరుపతి(నేరవిభాగం)/రామచంద్రాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సమాచారం రావడం. సెల్‌ఫోను లొకేషన్ గుర్తించి సంఘటన స్థలానికి చేరుకోవడం. ఆత్మహత్యకు యత్నిస్తున్న మెడికోను కాపాడటం. ఇదంతా 15 నిమిషాల్లోనే జరిగిపోయింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నంద్యాలకు చెందిన ఓ మెడికో తిరుపతిలోని ఎస్వీయూ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. కొంతకాలంగా మానసిక ఒత్తిడితో బాధ పడుతున్నాడు. గురువారం తరగతులకు హాజరయ్యాడు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ.. రామచంద్రాపురం మండలం పీవీపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న మామిడి తోటలో ఆత్మహత్య చేసుకుంటానని గురువారం రాత్రి తన స్నేహితులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు రామచంద్రాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. రామచంద్రాపురం సర్కిల్ వద్ద వాహనాల తనిఖీల్లో ఉన్న ట్రైనీ ఎస్పీ హేమంత్, సిబ్బంది రెండు బృందాలుగా విడిపోయి మెడికో కోసం గాలించారు. ఆ సమయంలో అతడి మొబైల్ ఫోన్ నెట్ వర్కు పనిచేయలేదు. దీంతో మెడికో స్నేహితులకు ఫోన్ చేసి మెల్లగా అతడ్ని లైన్‌లోకి తీసుకున్నారు. అలా లొకేషన్ ట్రేస్ చేసి అతడిని గుర్తించారు. స్టేషన్‌కు తీసుకొచ్చి ఆత్మహత్యకు పాల్పడడానికి గల కారణాలపై ఆరా తీశారు. అప్పటికే అతడు మానసిక ఒత్తిడిలో ఉండటంతో అలిపిరి పోలీసులకు అప్పగించారు. కౌన్సెలింగ్ కోసం రుయాలో చేర్పించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు ట్రైనీ ఎస్పీ చెప్పారు. ఏదైనా సమస్యలుంటే తోటి స్నేహితులు, తల్లి తండ్రులకు, బంధువులతో పంచుకుంటే పరిష్కార మార్గం దొరుకుతుందన్నారు. ఇలా ఆవేశంతో ఆత్మహత్యకు పాల్పడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చకండని విజ్ఞప్తి చేశారు. అనంతరం అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు. సకాలంలో స్పందించి మెడికోను కాపాడిన ట్రైనీ ఎస్పీ, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధ రాజు అభినందించారు.

63 ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 63 ప్రాంతాల్లో గురువారం అర్ధరాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృత్వంలో నలుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 40 మంది ఎస్ఐలు పాల్గొని వేరు వేరు ప్రాంతాల్లో 1329 వాహనాలను తనిఖీ చేశారు. అందులో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 14 కేసులు నమోదు చేశారు. బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై ఏడు కేసులు, 102 చలానాలు వేసి రూ. 84,780 జరిమానా వసూలు చేశారు.



తిరుమలేశుడి సేవలో ప్రీతి జింటా

ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతిజింటా శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె మూలమూర్తిని దర్శించుకోగా, ఆలయాధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

లాసెట్ దరఖాస్తుకు 27 వరకు గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ లాసెట్ దరఖాస్తుకు ఈనెల 27 చివరి తేదీగా నిర్ణయించారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ లాసెట్, ఏపీపీజీఎల్ సెట్-2025-26 నిర్వహించనున్నారు. మార్చి 3వ తేదీ నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 27వ తేదీతో దరఖాస్తు ప్రక్రియ ముగియనున్నట్లు లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ టి.సీతాకుమారి తెలిపారు.



తిరుచానూరు ఆలయం వద్ద మంటలు

- అర్ధరాత్రి తప్పిన పెను ప్రమాదం

తిరుచానూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలో శుక్రవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఆలయంలోని పోటుకు ఫ్రైడే గార్డెన్ నుంచి పైపులైను ద్వారా నెయ్యి సరఫరా అవుతోంది. అన్న ప్రసాదాలు, లడ్డూ ట్రేలు శుభ్రం చేసిన తర్వాత మిగిలిన నెయ్యి వ్యర్థాలను ఆలయ 3వ గేటు (ఆస్థాన మండపం)వద్ద ఉన్న ఆటోస్టాండ్ సమీపంలోని డ్రైనేజీలో కలుస్తాయి. ఆ వ్యర్థాలు కలిసే చోట టీటీడీ ఎలాంటి మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయలేదు. సరిగ్గా శుక్రవారం రాత్రి 11.15 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు నెయ్యి వ్యర్థాలు కలిసే చోట సిగరెట్ వెలిగించి పడేయడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో పక్కనే ఉన్న దుకాణం పాక్షికంగా కాలింది. చుట్టుపక్కల ఉన్న స్థానికులు, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. తమ వద్ద ఉన్న కార్బన్ డైఆక్సైడ్‌తో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించిన విజిలెన్స్ సిబ్బంది శివ గాయపడ్డారు. సకాలంలో ఫైర్ ఇంజన్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేశారు. పొగ ఎక్కువగా రావడంతో ఆలయంలోకి మంటలు వ్యాపించాయేమోననే అనుమానంతో విజిలెన్స్, పోలీస్ సిబ్బంది పరుగులు తీశారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాదరావు, సీఐ సునీల్‌కుమార్, పోలీసు, విజిలెన్స్ సిబ్బంది రాత్రి 12.15 గంటల వరకు అణువణువు పరిశీలిస్తున్నారు. టీటీడీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ సంఘటన చోటు చేసుకుందని, తిరిగి పునరావృతం కాకుండా ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



పూల బాట



తిరుపతి నగరంలో శుక్రవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై హోరు గాలులువీచాయి. ఈ క్రమంలో చంద్రగిరి, జూపార్కు, ఎస్వీయూ, స్విమ్స్ రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్ల నుంచి పూలు నేలరాలాయి. పసుపు పూలు చేత్తో చల్లినట్లు రోడ్లనిండా పరుచుకున్నాయి. ఈ దృశ్యాలు వాహనదారులు, పాదచారులకు కనువిందు చేశాయి. - తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

వెంకన్న సేవలో ప్రముఖులు



పయ్యావుల కేశవ్ - వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు - జైశంకర్ కృష్ణ

తిరుమల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియా, సభ్యులు వేకువజామున ఆలయంలో జరిగిన సుప్రభాతం, అభిషేకంసేవలో పాల్గొని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందజేశారు. మంత్రి పయ్యావుల కేశవ్, ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీ నరసింగ్, పార్లమెంటరీ ఇండస్ట్రీ కమిటీ సభ్యులు, ఇండియన్ మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు, ఎన్టీ రామారావు చివరి కుమారుడు జైశంకర్ కృష్ణ, ఏపీ డిప్యూటీ సీఎం ఓఎస్డీ కృష్ణతేజ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

కల్యాణకట్టను పరిశుభ్రంగా ఉంచుకోండి

● అధికారులను ఆదేశించిన టీటీడీ చైర్మన్



భక్తులతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు

తిరుమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులు తలనీలాలు సమర్పించే కల్యాణకట్టల్లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా ప్రధాన కల్యాణకట్టతోపాటు నందకంలోని మినీ కల్యాణకట్టను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన భక్తులతో మాట్లాడుతూ టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలను అడగగా, బాగున్నాయంటూ వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక ప్రాంతంలో రద్దీ అధికంగా ఉన్నప్పుడు రద్దీ తక్కువగా ఉన్న ప్రాంతంలోని కల్యాణకట్టకు భక్తులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కల్యాణకట్టలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సేవాభావంతో విధులు నిర్వహించాలని ఉద్యోగులను ఆదేశించారు. చైర్మన్‌తో పాటు సభ్యులు శాంతారామ్, నరేష్‌కుమార్ ఉన్నారు.

టీటీడీ చైర్మన్‌కు ఒంటిమిట్ట రామాలయ అర్చకుల ఆశీర్వాదం

ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు ఒంటిమిట్టలోని కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా జరిగిన సందర్భంగా ఆ ఆలయ అర్చకులు శుక్రవారం సాయంత్రం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వేదాశీర్వచనం చేశారు. అనంతరం స్వామి తలంబ్రాలు, వస్త్రాలు, తీర్థప్రసాదాలను చైర్మన్‌కు అందించారు. ఒంటిమిట్ట ఆలయ డిప్యూటీఈవో నటేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో మూలస్థానమ్మ

తిరుపతి రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలో వెలసిన మూలస్థానమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకం నిర్వహించారు. పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త లీలావతమ్మ, మునికృష్ణారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.


చంద్రగిరిలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

చంద్రగిరి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలోని ఎస్వీ సినిమా థియేటర్ సమీపంలో ప్రతిభా స్కూల్‌లో దివ్యాంగజన్ సహాయ సేవా సమితి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందే విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 81793 55963, 91828 62819 నంబర్లను సంప్రదించాలన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి నారాయణగిరిలోని 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 45 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. బుధవారం హుండీ ఆదాయం రూ.3.59 కోట్లు లభించింది. గురువారం శ్రీవారిని 56,279 మంది భక్తులు దర్శించుకోగా, 24,019 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుచ్చిపై పద్మావతీదేవి సాక్షాత్కారం



తిరుచానూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మ వారికి శుక్రవారం రాత్రి అత్యంత వేడుకగా తిరువీధి ఉత్సవం జరిగింది. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి మూలవర్లకు నేత్రపర్వంగా అర్చకులు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు కల్యాణోత్సవం, లక్ష్మీపూజ కన్నులపండువగా జరిగింది. మధ్యాహ్నం వేడుకగా తిరుమంజనం నిర్వహించారు. సర్వ అలంకార శోభితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్ నాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

● నారావారిపల్లెలో నాయకులను అడ్డుకున్న పోలీసులు



నారావారిపల్లె వచ్చిన వడ్డెర సంఘం నాయకులు

చంద్రగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని చంద్రగిరి మండలం, నారావారిపల్లెలోని ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రాన్ని ఇచ్చేందుకు ఆ సంఘం నాయకులు రావడంతో పోలీసులు వారిని అడ్డుకొని టీటీడీ కల్యాణ మండపానికి తీసుకెళ్లారు. దీంతో వడ్డెర సంఘం నాయకులు రోడ్డుపై కొంతసేపు నిరసన తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర ఎస్టీ సాధన సమితి అధ్యక్షుడు కులాయప్ప మాట్లాడుతూ వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్టీ సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి తురక అమరనాథ్ మాట్లాడుతూ వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసినా, ఇంతవరకు ఎవరికీ న్యాయం జరగలేదన్నారు. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు వడ్డెర్లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, ఆ మేరకు తాము ఉద్యమం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఓసీసీఐ చీఫ్ అడ్వయిజర్ గుంజి నరసింహారావు, ఓసీసీఐ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసులు, కుమార్, శంకరయ్య, సుబ్రమణ్యం, వెంకటేష్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో నేడు 'స్వచ్ఛాంధ్ర'

● సామూహిక శ్రమదానం నిర్వహించనున్న టీటీడీ

తిరుమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారమైన ఏప్రిల్ 19వ తేదీన తిరుమలలో సామూహిక శ్రమదానాన్ని టీటీడీ నిర్వహించనుంది. ఇందులో భాగంగా మొదటి ఘాట్‌రోడ్డులో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని రోడ్లపై చెత్తను తొలగించి శుభ్రం చేయనున్నారు. అలిపిరి కాలినడకదారిలోని కుంకాల పాయింట్(చివరి) వద్దనుంచి ఈకార్యక్రమం ప్రారంభం కానుంది.

మీ దగ్గర ఈ-వేస్ట్ ఉందా..?

- ట్రిపుల్ ఆర్ సెంటర్‌కు ఇవ్వండి


తిరుపతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మీదగ్గర వృథాగా ఉన్న ఈ-వేస్ట్(ఎలక్ట్రానిక్ వస్తువులు)ను నగరంలోని రాయల్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ (ట్రిపుల్ ఆర్)సెంటర్‌లో ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలకు పిలుపునిచ్చారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎలక్ట్రికల్ వస్తువులైన కంప్యూటర్లు, బ్యాటరీలు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రికల్ చార్జర్లు తదితర వస్తువులు సెంటర్ వద్ద అందజేయవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఈ-వేస్ట్ నిర్వహణ, సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఉదయం 8 గంటలకు పాత మునిసిపల్ కార్యాలయం నుంచి శ్రీదేవి కాంప్లెక్స్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. ప్రజలు, విద్యార్థులు, దుకాణదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నీతి కథల పుస్తకాల పంపిణీ



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బైరాగిపట్టెడలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు శుక్రవారం తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌తో కలసి నీతి కథల పుస్తకాలు పంపిణీ చేశారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో నడుచుకుంటూ తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు బాలకృష్ణ, మహేశ్, గిరిబాబు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణాపురం ఠాణా వద్ద శుక్రవారం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. వెస్ట్ సీఐ మురళీమోహన్ వివరాల మేరకు.. ఠాణా వద్ద వృద్ధుడు చనిపోయినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. కొన్ని రోజులుగా అతను గాంధీ రోడ్డు, కర్నాల వీధి, కృష్ణాపురం ఠాణా ప్రాంతాల్లో భిక్షమెత్తుకుని జీవనం సాగిస్తున్నట్లు చూసినవారు చెప్పారు. అనారోగ్యంతో చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలూ లభించకపోవడంతో మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు 9440796750కు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యతోనే సామాజిక గౌరవం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : విద్యతోనే సామాజిక గౌరవం లభిస్తుందని ట్రైనీ ఐపీఎస్ హేమంత్ అభిప్రాయపడ్డారు. తిరుపతిలోని గీతాంజలి గ్రూప్ పాఠశాలల కాన్వొకేషన్ కార్యక్రమం శుక్రవారం ఉదయం మహతి ఆడిటోరియంలో నిర్వహించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన హేమంత్ మాట్లాడుతూ విద్యతో పాటూ పిల్లలకు నైతిక విలువలు నేర్పాలన్నారు.గీతాంజలి గ్రూప్ పాఠశాలల చైర్మన్ సుధాకర్, ఎండీ డాక్టర్ మాధవి,ప్రిన్సిపాళ్లు రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తుగా స్పీడు బ్రేకర్లు

● ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు



నరసింగాపురం రైల్వే గేటు వద్ద ఎత్తుగా ఉన్న స్పీడు బ్రేకరు

చంద్రగిరి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి, మదనపల్లె జాతీయ రహదారిలో చంద్రగిరి మండలం, నరసింగాపురం రైల్వే గేటు వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకర్ల వలన ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్పీడు బ్రేకర్లు ఎత్తుగా ఉండటం వలన వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నరసింగాపురం రైల్వే గేటు వద్ద రెండు వైపులా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఈ స్పీడు బ్రేకర్లకు వేసిన సిమెంటు దిమ్మెలు ద్విచక్ర వాహనాలకు తగలటంతో అదుపు తప్పి ప్రయాణికులు కిందపడిపోతున్నారు. కార్లు కింద భాగంలో దెబ్బతింటున్నాయి. జాతీయ రహదారిలో ఇలాంటి స్పీడు బ్రేకర్లు ఉండటం వలన అంబులెన్స్‌లు రావడానికి కూడా ఇబ్బందిగా ఉంటుంది. స్పీడు బ్రేకర్లను ఏటవాలుగా నిర్మించాల్సి ఉండగా, మధ్యలో సిమెంటు దిమ్మె పెట్టడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా జాతీయ రహదారి అధికారులు స్పందించి నిబంధనల మేర స్పీడు బ్రేకర్లు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవార ప్రార్థనలు



సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చిలో దైవ సందేశమిస్తున్న పాస్టర్ ప్రేమ్‌కుమార్

పాకాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తును శిలువ వేసిన రోజును పురస్కరించుకొని మండలంలోని క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఉపవాసంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆయా చర్చిలలో ప్రార్థనలు జరిపారు. సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చిలో ప్రపంచ మానవాళి, పాపవిమోచన కోసం ఏసుక్రీస్తు శిలువపై ప్రాణాలు అర్పించారని, ఆయన చూపిన ప్రేమ, కరుణ, దయ, క్షమాగుణాలు కలిగి జీవించాలని పాస్టర్ ప్రేమ్‌కుమార్ బోధించారు. రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చిలో క్రైస్తవులు ఫాదర్ ఆంతోని రాజ్ ఆధ్వర్యంలో శిలువ యాత్ర ఆరాధన చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి కార్యదర్శి విక్టర్ ఎం.రాఘవేలు, కోశాధికారి జీ.అరుళ్ సెల్వి తదితరులు పాల్గొన్నారు.

వేద విద్యార్థులను ఒత్తిడికి గురిచేయవద్దు

● బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్



వేదవిద్యార్థులతో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

తిరుమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేద విద్యార్థులను ఒత్తిడికి గురిచేయవద్దని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. శుక్రవారం తిరుమలలోని ధర్మగిరి వేదపాఠశాల (వేదవిజ్ఞానపీఠం)ను కమిషన్ సభ్యులు గొండు సీతారాం, ఆదిలక్ష్మి త్రిపర్ణ, బత్తుల పద్మావతి, జంగం రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్, అధ్యాపకులు, వేద విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య, కోర్సుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న భోజన, వసతి సదుపాయాలపై ఆరా తీశారు. ఆట స్థలంలో ఏ క్రీడలు నిర్వహిస్తున్నారు, ఎంతమంది అధ్యాపకులు ఉన్నారు, సీసీ కెమెరాలు ఎన్ని ఉన్నాయి, పరిశుభ్రత ఎలా ఉందనే అంశాలను పరిశీలించారు. రక్షణ విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. తాము గ్రహించిన అంశాలు, సమస్యలను నివేదిక రూపంలో టీటీడీ అధికారులు, దేవదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

గంజాయి స్మగ్లర్ సహా ఐదుగురు విక్రేతల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వాహనాల తనిఖీ సందర్భంగా గంజాయి ప్రధాన స్మగ్లర్‌తోపాటు నలుగురు విక్రేతలను అరెస్టు చేశారు. వారి నుంచి 12 కిలోల గంజాయి, 2 ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ రామయ్య తెలిపిన ప్రకారం.. ఏఎస్పీ రవిమనోహరాచారికి అందిన సమాచారం మేరకు డీఎస్పీ భక్తవత్సలం, యూనివర్సిటీ సీఐ రామయ్య, సిబ్బంది కలసి సీతమ్మ నగర్ 80 అడుగుల రోడ్డులో కొందరు అనుమానితులు పారిపోతుండగా పట్టుకున్నారు. వీరిలో అన్నమయ్య జిల్లా పెద్దతిప్ప సముద్రం మండలం పులికల్లు గ్రామానికి చెందిన చీరల కార్తీక్ గంజాయి స్మగ్లర్. ఇతడు పలు కేసుల్లో నిందితుడు. ఇక గంజాయి విక్రేతల్లో అన్నమయ్య జిల్లా పెద్దపల్లి గ్రామానికి చెందిన ఎద్దుల హరి, కురబలకోట మండలం మత్తివారిపల్లికి చెందిన రాజోల హరినాథ్, పులివెందుల టౌన్ ఎస్‌బీఐ కాలనీకి చెందిన వనం జీవన కుమార్, వరి కసువుపల్లి గ్రామానికి చెందిన సి.దిలీప్ రెడ్డిని గుర్తించారు. వీరిలో వనం జీవన కుమార్ గతంలో ఒక హత్య కేసులో నిందితుడు. చీరల కార్తీక్ కాకినాడ జిల్లా తుని నుంచి గుర్తుతెలియని వ్యక్తి ద్వారా గంజాయి కొనుగోలు చేసి తన స్నేహితులైన నలుగురు వ్యక్తులకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నాడు. వీరు గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా మార్చి తిరుపతి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందుగా అందిన సమాచారం మేరకు వారిని సీతమ్మ నగర్ రేకుల షెడ్డు పక్కన ఖాళీ స్థలంలో అరెస్టు చేశారు. గంజాయి అక్రమ రవాణాపై సమాచారం ఉంటే వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ 80999 99977 నెంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. ఎస్‌ఐలు కృష్ణయ్య, భువనేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాల నివారణ



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గాజులమండ్యం, తిరుపతి, రేణిగుంటలోని మల్లాది డ్రగ్స్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

పూలే, అంబేడ్కర్ కులవివక్షకు గురైన వారే



సమావేశంలో మాట్లాడుతున్న వినోదిని

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పూలే, అంబేడ్కర్ వంటి సంఘ సంస్కర్తలు కులవివక్షతకు గురైన వారేనని రచయిత, కడప యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంఎం వినోదిని అన్నారు. తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం పూలే, అంబేడ్కర్ ఆలోచనలు-నేటి ఆవశ్యకతపై సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ శాంతి, మానవీయ విలువలు, సత్యాన్వేషణతో సమాజ మార్పు కోసం గొప్ప రచనలు చేయడంతో పాటు సంస్కరణ పోరాటాలు నడిపారన్నారు. కార్యక్రమంలో ఎస్వీయూ పరిశోధన విద్యార్థి గరికపాటి రమేష్, నడ్డి నారాయణ, టెంకాయల దామోదరం, నాగార్జున పాల్గొన్నారు.

ముమ్మరంగా నాకాబందీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పోలీసులు రాత్రిపూట నాకాబందీ ముమ్మరం చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత రోడ్లపై తిరుగుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా తిరుగుతున్న వారిని పట్టుకుని ఫింగర్ ప్రింట్, కనుబొమ్మల ఫొటోలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి తిరుపతి నగరంలో పోలీసులు అర్ధరాత్రి తనిఖీలు చేపట్టారు. ఆకతాయిలను పట్టుకుని హెచ్చరికలు జారీ చేశారు. అనుమానితుల వివరాలు సేకరించి, విడిచిపెట్టారు.

అన్నదానం

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జనసేన నేత ఆరణి శివకుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని రుయా ఆస్పత్రి వద్ద శుక్రవారం అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేదలకు, రోగులకు, సహాయకులకు స్వయంగా వడ్డించారు. కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాడి పశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



పశువులను పరీక్షిస్తున్న డాక్టర్లు రవికుమార్, జగపతిరామయ్య, వైకుంఠరావు తదితరులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు వేసవిలో పశువుల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రవికుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని నెన్నూరులో జాతీయ సాంఘిక సేవా పథకం కింద తిరుపతి ఎస్వీవెటర్నరీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆయన మాట్లాడుతూ పశువులకు సోకే వివిధ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. దీనిలో భాగంగా పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఎస్వీవెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య, వీసీసీ హెడ్ డాక్టర్ వైకుంఠరావు, పశువైద్య కళాశాల విద్యార్థులు, మండల పశువైద్యాధికారి డాక్టర్ జయకిషోర్, పశువైద్య సహాయకులు యుగంధర్, సోమశేఖర్, రాజశేఖర్, సర్పంచ్ అనసూయ, ఎంపీటీసీ జ్ఞానమ్మ, పాడి రైతులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గంలో నడవండి



ప్రార్థనలు చేస్తున్న సీనియర్ పాస్టర్ అరుల్ అరసు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేబీ లేఅవుట్‌లోని షెకినా చర్చిలో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం సీనియర్ పాస్టర్ అరుల్ అరసు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో నడవాలని కోరారు. పాస్టర్లు కిస్టోఫర్ సామ్యూల్, జెర్మియా, మోషే, సుసన్, హిస్సిబా, జెస్సీ దెబోరాలు, పలువురు క్రిస్టియన్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



తిరుపతి ఈస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు గుడ్ ఫ్రైడే విశిష్టతను తెలియజేశారు. మానవాళి పాపపరిహారం కోసం ఏసుక్రీస్తు కల్వరి సిలువలో ప్రాణత్యాగం చేశారని వివరించారు. క్రైస్తవులు పాటలు పాడుతూ దేవుడిని ప్రార్థించారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

రామచంద్రాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం సాగు వైపు మొగ్గు చూపాలని టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాయలచెరువులో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్‌ప్లాన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో బాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంటీ రంగయ్య ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ప్రతినిధులు లాలమ్మ, సుబ్రహ్మణ్యంరెడ్డి, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో తీగల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. శేషాద్రి నగర్, దుర్గానగర్, ఎమ్మార్ పల్లి, టీటీడీ ప్లాట్స్ ఎస్‌కేడీ నగర్, టీటీడీ ఏడీ బిల్డింగ్, భవానీనగర్, మధురానగర్, కొర్లగుంట, తాతయ్యగుంట, అశోక్‌నగర్, తుడ రోడ్డు, రెడ్డి-రెడ్డి కాలనీ, టీకే స్ట్రీట్, కేకే లేఅవుట్, రైల్వే కాలనీ, సుందరయ్యనగర్, క్రాంతినగర్, జీవకోన, శివజ్యోతి నగర్, ఉపాధ్యాయనగర్, శ్రీనగర్‌కాలనీ, ఎస్ఎల్‌వీ నగర్, అయ్యప్పకాలనీ, ఎర్రమిట్ట, సత్యనారాయణపురం, సాయినగర్, వెంకటరమణ లేఅవుట్, రాఘవేంద్ర నగర్, జర్నలిస్ట్ కాలనీ, భూపాల్ నగర్, కైలాస్ నగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం హర్షణీయమని టీడీపీ ఎస్సీ సెల్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ బిల్లు ద్వారా మాల, మాదిగలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. బిల్లు కార్యరూపం దాల్చడానికి కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గంగులయ్య, నీలిమ, నల్లాని బాలాజీ, మోహన్, మునికృష్ణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు ఆచార్య సర్వోత్తమరావుకు సన్మానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ తెలుగు విభాగ విశ్రాంతాచార్యులు ఆచార్య కె. సర్వోత్తమరావును శనివారం సన్మానించనున్నారు. పాతికేళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందిన ఆయన్ను తెలుగు విభాగం- విశ్వశ్రీ సాహిత్య సమాఖ్య సన్మానించనున్నాయి. ఉదయం 11 గంటలకు ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, విశ్రాంతాచార్యులు గార్లపాటి దామోదర నాయుడు పాల్గొంటారని తెలుగు విభాగాధిపతి ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ తెలిపారు.

ఎస్పీడబ్ల్యూ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బదిలీ

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ అనంతను టీటీడీ విద్యాశాఖ బదిలీ చేసింది. ఆమె అన్యమతస్థురాలని, కళాశాలలోని ప్రాక్టికల్ మెటీరియల్స్‌ను బయట విక్రయించారని, అధ్యాపకులు, సిబ్బంది పట్ల అసభ్యకరంగా వ్యవహరించడంతో పాటు డీఏ సెక్షన్‌కు ఫిర్యాదు చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఆమె అన్యమతస్థురాలు కావడంతో ఎస్పీడబ్ల్యూ పాలిటెక్నిక్ కళాశాల నుంచి నరసింగాపురంలోని ఎస్వీ ఆయుర్వేదిక్ ఫార్మసీకి బదిలీ చేస్తూ టీటీడీ ఇన్‌ఛార్జి డీఈవో జి.విజయలక్ష్మి ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే ఆమెను సస్పెండ్ చేయడమో లేదా ఏదైనా ప్రభుత్వ సంస్థకు బదిలీ చేయకుండా ఇలా టీటీడీలోని మరో సంస్థకు బదిలీ చేయడాన్ని ఉద్యోగులు, అధ్యాపకులు, సిబ్బంది వ్యతిరేకిస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



తిరుపతి అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం పలువురు బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. సంజయ్‌గాంధీకాలనీకి చెందిన జె.మునీంద్రకు రూ.48వేలు, జీవకోన రాజీవ్‌నగర్‌కు చెందిన ఎం.ఆదెమ్మకు రూ.2,21,260 చెక్కులను తన కార్యాలయంలో అందించారు. లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, సుదాకర్, శిరీష, బాబ్జీ, పురుషోత్తం పాల్గొన్నారు.

నేడు జనవాణి : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నేతృత్వంలో శనివారం జనవాణి పేరిట ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఎన్జీవో కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కార్య క్రమం ప్రారంభమవుతుంది. ప్రజలు సమస్యలతో కూడిన వినతులను అందజేయాలని ఎమ్మెల్యే కోరారు.

'రోజా నోటి దురుసు తగ్గించుకోవాలి'



మాట్లాడుతున్న ఆకేపాటి సుభాషిణి

తిరుపతి(ఎమ్మార్ పల్లె), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రోజా నోటి దురుసు తగ్గించుకుని మాట్లాడాలని జనసేన పార్టీ కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి హితవుపలికారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ రోజా పోలీసులపై అసభ్యకర పదజాలాన్ని వాడడం సరికాదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సతీమణి గుండు చేయించుకోవడంపైనా విమర్శలు చేయడం బాధాకరమన్నారు. సనాతన ధర్మం, తిరుమల శ్రీవారిపై ఉన్న నమ్మకం, కుమారుడు ప్రమాదం నుంచి బయటపడటంతో మొక్కులు చెల్లించుకున్నారని, దీన్ని కూడా రాజకీయం చేసి మాట్లాడటం సబబు కాదన్నారు. వైసీపీ ఓడిపోవడానికి రోజా వ్యవహార శైలి, మాట తీరే కారణమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నగరంలో భూమన క్రియేషన్స్‌లో రోజుకొక డ్రామా వేస్తున్నారని, వాటిని నమ్మే స్థితిలో జనం లేరని అన్నారు. ఈ సమావేశంలో వీర మహిళలు, చందన, అమృత, రాధ, శిరీష, శాంతి పాల్గొన్నారు.

నేడు ఘంటసాల స్వరనీరాజనం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఘంటసాల గాన గౌతమి-భీమవరం, ఘంటసాల గాన కళాపీఠం - తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఘంటసాల స్వరనీరాజనం కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు మహతి ఆడిటోరియంలో సభ, సంగీత విభావరి జరగనుంది. పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

ఆంధ్రజ్యోతి- ఐఆర్ఎంఎస్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పోకు

ప్రముఖ సంస్థల రాక

తిరుపతి(విద్య/రూరల్), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి- ఐఆర్ఎంఎస్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో శని, ఆదివారాల్లో జరగనున్న ఎడ్యుకేషన్ ఎక్స్‌పోకు దక్షిణ భారతదేశంలో ప్రతిష్ఠాత్మకమైన 30విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, కన్సల్టెన్సీ ఏజెన్సీలు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్(ఐఆర్ఎంఎస్)ఫౌండర్ అండ్ సీఈవో రాజ.సి, టర్న్‌కీ ఈవెంట్స్ ఫౌండర్ అండ్ సీఈవో రాధాక్రిష్ణన్ టీకే శుక్రవారం తెలిపారు. ఎక్స్‌పోను సందర్శించే విద్యార్థులు.. తల్లిదండ్రులు.. విద్యావర్గాల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. వాటి వివరాల సంక్షిప్త సమాచారం మీకోసం..



రాజ.సి, రాధాక్రిష్ణన్ టీకే



రాజలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఆర్ఐటీ, చెన్నై): నాక్ ఏప్లస్ గ్రేడ్ పొంది.. ఎన్ఐఆర్ఎఫ్‌లో ర్యాంకు సాధించిన విద్యాసంస్థ. అన్నాయూనివర్సిటీకి అనుబంధంగా.. ఏఐసీటీఈ ఆమోదంతో ఎన్‌బీఏ గుర్తింపు ఉన్న కోర్సులను అందిస్తోంది. విర్టుస, జేఎఫ్, సింప్సన్, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఈసీ కౌన్సిల్, ఏఐ, డీఎస్, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునాతన సాంకేతికతల్లో మరిన్ని కంపెనీలతో సీఈవోలను ఏర్పాటు చేసింది.



ఎస్ఆర్ఎం యూనివర్సిటీ (రామాపురం, చెన్నై): విశ్వవిద్యాలయాల్లో టాప్ ర్యాంకింగ్ పొందిన ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎస్ఆర్ఎంఐఎస్‌టీ) బి.టెక్‌తోపాటు డాక్టోరల్ ప్రోగ్రామ్స్(పీహెచ్‌డీ ఫుల్ టైమ్/పార్ట్‌టైమ్) అందిస్తోంది. ఏపీలో మంగళగిరి మండలం నీరుకొండ గ్రామం వద్ద ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బీటెక్, ఎంటెక్/యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు అందిస్తున్నారు.



ఐఐటీ మద్రాస్(చెన్నై): ఐఐటీ మద్రాస్‌లో బీఎస్ డిగ్రీ అందిస్తున్నారు. జేఈఈ లేకుండా చేరవచ్చు. 17వేలమందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. కీలకమైన ప్రోగ్రామ్ డేటా సైన్స్ ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ అందుబాటులో ఉంది.



అపోలో విశ్వవిద్యాలయం (చిత్తూరు): చిత్తూరు సమీపంలో మురకంబట్టులోని అపోలో యూనివర్సిటీలో బీటెక్, బీఎస్సీలో ఫిజీషియన్ అసిస్టెంట్, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, ఇమేజింగ్ టెక్నాలజీ, అనస్థీషియాలజీలో ఆపరేషన్ టెక్నాలజీ, మూత్రపిండ డయాలసిస్ టెక్నాలజీ, రెస్పిరేటరీ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నాలజీ, బయోమెడికల్ సైన్సెస్, జెనెటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, సైకాలజీ కోర్సులు, బీబీఏ, ఎంబీఏ, సోషల్ వర్క్ కోర్సులు నిర్వహిస్తున్నారు.



జీఆర్‌టీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(చెన్నై): అన్నా యూనివర్సిటీకి అనుబంధంగా..ఏఐసీటీఈ(న్యూఢిల్లీ) ఆమోదంతో ఇంజనీరింగ్ కోర్సులను అందిస్తోంది. చెన్నై-తిరుపతి జాతీయ రహదారిలో తిరుత్తణి వద్ద 87ఎకరాల విస్తీర్ణంలో జీఆర్టీ ఇంజనీరింగ్ కళాశాల నిర్వహిస్తున్నారు.



చెట్టినాడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(చెన్నై): అన్నాయూనివర్సిటీకి అనుబంధంగా..ఏఐసీటీఈ (న్యూఢిల్లీ) ఆమోదంతో ఇంజనీరింగ్ కోర్సులను అందిస్తోంది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటాసైన్స్ (ఏఐఅండ్‌డీఎస్), సైబర్ సెక్యూరిటీ, బయోమెడికల్, ఈసీఈ కోర్సులు అందిస్తున్నారు.



వేల్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ (విస్టాస్): డీమ్డ్‌టుబి యూనివర్సిటీ. నాక్ ఏప్లస్‌ప్లస్ గ్రేడ్ పొందిన బెస్ట్ మల్టీడిసిప్లినరీ యూనివర్సిటీ. ట్యూషన్ ఫీజులో వందశాతం స్కాలర్‌షిప్ ఇస్తున్నారు. వందశాతం జాబ్ ఓరియెంటెడ్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, లా, అలైడ్ హెల్త్ సైన్సెస్.. అండ్ 50శాతం వాల్యూయాడెడ్ కోర్సులను అందిస్తోంది. 92శాతం ప్లేస్‌మెంట్ రేటింగ్ కలిగిన సంస్థ.



అనురాగ్ యూనివర్సిటీ (హైదరాబాద్): నాక్ ఏప్లస్ గ్రేడ్ పొంది.. ఎన్ఐఆర్ఎఫ్‌లో ర్యాంకు సాధించిన విద్యాసంస్థ. మల్టీడిసిప్లినరీ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, లిబరల్ ఆర్ట్స్, మెడికల్ సైన్సెస్ అండ్ నర్సింగ్ కోర్సులను అందిస్తోంది.

జయగ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్(చెన్నై): వందశాతం ప్లేస్‌మెంట్ కలిగిన సంస్థ. ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, మెడిసిన్ అండ్ సర్జరీ, టెక్నాలజీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్, పారామెడికల్, లైఫ్‌సైన్సెస్, హాస్పిటాలిటీ, మీడియా, కల్చర్, ఆర్ట్స్ అండ్ సైన్సెస్, పాలిటెక్నిక్, ఆర్కిటెక్చర్, ఫిజియోథెరపీ, నర్సింగ్, ఎడ్యుకేషన్ వంటి కోర్సులను అందిస్తోంది.



కళకళలాడుతున్న కర్ణాటక వోల్వో బస్సు - కళావిహీనంగా ఆంధ్రా వోల్వో బస్సు

కెఎస్ ఆర్టీసీ అలా.. ఏపీఎస్ ఆర్టీసీ ఇలా...!

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సెంట్రల్ బస్టాండుకు వచ్చే బస్సులలో కేఎస్ఆర్టీసీ వోల్వో బస్సులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అదే సమయంలో ఆంధ్రా వోల్వో బస్సులు పాతబడిపోయి.. రంగులు తేలిపోయి కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. బస్సుల లోపల నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వోల్వో కంపెనీ ఒక్కటే అయినా ఆయా రాష్ట్రాల్లో రూపొందించే బస్సుల్లో చాలా తేడా కనిపిస్తోంది. వసతుల కల్పనలోనూ అదే పరిస్థితి ఉంటోంది. ఈ క్రమంలో ప్రయాణికులు ముందు కర్ణాటక బస్సులనే ఎంచుకుంటున్నారు. ఆంధ్ర బస్సులను లోడ్ చేయడానికి డ్రైవర్, కండక్టర్ నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

డివైడర్ తోటలు ఎండిపోతున్నాయ్..!




తిరుపతి అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలురోడ్ల డివైడర్లలో ఏర్పాటు చేసిన తోటలు ఎండిపోతున్నాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, నీరు పట్టకపోవడంతో మొక్కలు, పచ్చిక మాడిపోతున్నాయి. నగరం పచ్చదనం కోసం పలు రోడ్లలో వివిధ రకాల మొక్కలు, పూలచెట్లు పెంచుతున్న విషయం తెలిసిందే. రెండు నెలలుగా నిర్వహణ లోపంతో పిచ్చిమొక్కలు, కంపచెట్లు, కలుపు పెరుగుతూ ప్రధాన మొక్కలను పెరగనీయకుండా చేస్తున్నాయి. పైగా పోషకాలు కొరవడి కొత్త ఆకులు, పుష్పాలు రావడం లేదు. దీంతో డివైడర్లు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

- తిరుపతి అర్బన్

చోరుల అడ్డాగా సీబీఎస్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ సెంట్రల్ బస్టాండు చోరులకు అడ్డాగా మారింది. రెండునెలల వ్యవధిలో 9చోరీలు జరిగాయంటే పరిస్థితి ఎలాఉందో అర్థంచేసుకోవచ్చు.రాత్రి గస్తీ కొరవడటం, ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది సాయంత్రం 6 గంటల తర్వాత కనిపించకపోవడంతో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. తిరుమలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో రాత్రిపూట బస్టాండులో తలదాచుకునే యాత్రికులే లక్ష్యంగా మొబైల్ ఫోన్లు, డబ్బులు అపహరిస్తున్నారు. రెండురోజుల క్రితం కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చిన ఒక మహిళ మెడ నుంచి 24 గ్రాముల బంగారు చైన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనిపై అవుట్ పోస్టు పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు.వారంరోజుల క్రితం విజయవాడ వెళుతున్న ఒక బీటెక్ విద్యార్థికి చెందిన ల్యాప్‌టాప్ అపహరణకు గురైంది. తాజాగా మంగళవారం అర్ధరాత్రి చెన్నై ప్లాట్‌ఫారంలో నిద్రిస్తున్న మహిళ చెవిలో కమ్మలు లాక్కెళ్లారు.



మా గ్యాంగ్‌లీడర్

చిత్తూరు,ఆంధ్రజ్యోతి

తవణంపల్లె మండలం జి.గొల్లపల్లెకు చెందిన మధుసూదనరావు పీయూసీలో చంద్రబాబుతో కలిసి చదువుకున్నారు. చంద్రబాబుతో కలిసి యూత్ కాంగ్రెస్‌లో పనిచేశారు. పీపీగా పనిచేసి రిటైరయ్యారు. ఈయన ఒకనాటి జ్ఞాపకాలు..



మధుసూదనరావు

బీసీ స్నేహితుడ్ని లీడర్ చేశారు

ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో 1968-69లో నేను, చంద్రబాబు కలిసి చదువుకున్నాం. నేను ఇంటర్ ఫెయిల్ కావడంతో ఆయనతో పాటు కలిసి డిగ్రీకి వెళ్లలేకపోయాను. డిగ్రీలో మా అన్న పద్మనాభ నాయుడు అయనతో కలిసి చదువుకున్నాడు. చంద్రబాబు, మా అన్న, మదనపల్లెకు చెందిన కోటేశ్వరరావు (రిటైర్డ్ గ్రామీణ బ్యాంకు మేనేజరు). ముగ్గురూ కలిసి ఎ బ్లాక్‌లోని రూమ్ నెంబర్ 26లో ఉండేవారు. యూనివర్శిటీలో నాన్ రెడ్డి స్టూడెంట్స్‌కు చంద్రబాబు నాయకత్వం వహించారు. అప్పట్లోనే సమానత్వం పేరుతో బీసీ స్నేహితుడిని విద్యార్థి సంఘ చైర్మన్ చేశారు. ఆర్థికంగా మరీ ఎక్కువ స్థాయిలో లేకున్నా మా గ్యాంగులో ఆయనే లీడర్. బయటికి ఎక్కడికెళ్లినా చుట్టూ పదిమంది ఉండేవారు. మా భుజాలపై చేతులేసి మాట్లాడేవారు.జల్లికట్టు పోటీలకు ఉత్సాహంగా వచ్చేవారు. తనూ తలపడేవారు. ఒకసారి గాయపడ్డారు కూడా.



స్నేహితులతో కర్ణాటకలోని శ్రావణ బెళగొళలో బాబు




మీసం మెలేస్తున్న చంద్రబాబు

150 బైక్‌లతో ర్యాలీ

అప్పటి చంద్రగిరి నియోజకవర్గంలోని పులిచెర్ల సమితి యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఆయన రాజకీయ ఆరంగేట్రం జరిగింది. ఇందిరా గాంధీ తిరుపతి పర్యటనలో సుమారు 150 బైక్‌లతో ర్యాలీ చేసి ఆమె దృష్టిలో పడ్డారు. రాజగోపాల నాయుడి ప్రోత్సాహంతో 1978 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు.

నాకోసం ఢిల్లీ వచ్చారు

'మీ అన్నదమ్ముల్లో ఒకరు రాజకీయాల్లోకి రండి' అంటూ చంద్రబాబు పిలిస్తే నేను వెళ్లా. యూత్ కాంగ్రెస్‌లో చంద్రబాబు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, నేను జిల్లా అధ్యక్షుడిగా పనిచేశాం. 1983 ఎన్నికల్లో నాకు చిత్తూరు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించేందుకు ఢిల్లీకి కూడా వచ్చారు. పుత్తూరు నుంచి టికెట్ ఇవ్వడంతో నేను పోటీ చేయలేదు. అప్పటి టీడీపీ గాలిలో అందరూ ఓడిపోయారు. చంద్రబాబుతో పాటు నేనూ టీడీపీలో చేరా. ఇక రాజకీయాలు చేయలేను, లా చదివిన నాకు ఏదైనా ఉద్యోగం ఇప్పించమని చంద్రబాబును కోరా. అలా ఆయన వల్ల 1986 నుంచి 2011 వరకు పీపీగా పనిచేసి రిటైరయ్యా. ఇప్పుడు వ్యవసాయం చేసుకుంటున్నా.



75 ఏళ్ల బాబు

చంద్రబాబు ఎస్వీయూనివర్సిటీలో పీజీ చదివేటప్పుడు కొమ్మినేని శ్రీనివాసులు నాయుడు ఆయనకు సహచరుడు. ఒకే బెంచ్, ఒకే గదిలో ఉండేవారు. చంద్రబాబును దగ్గరగా యూనివర్శిటీలో పరిశీలించిన స్నేహితుడు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు సభ్యుడిగా చేసిన ఆచార్య కొమ్మినేని శ్రీనివాసులు నాయుడు తన దోస్తు గురించి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న యూనివర్శిటీ సంగతులు..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పదిమందిని నడిపించేవాడు

చంద్రబాబు పీజీ సహచరుడు కొమ్మినేని శ్రీనివాసులు నాయుడు



వెంట జనం ఉండాలి

1972-73లో బాబు మొదటి సంవత్సరం ఎంఏ (ఎకనామిక్స్) చదివినప్పుడు చాలా తక్కువమంది ఉత్తీర్ణులు అయ్యారు. అందులో బాబు ఒకరు. ఆయన పట్టుదల, కృషికి ఇదీ ఒక చిన్న తార్కాణం. ఏ పని చేయాలన్నా, ఎక్కడికి వెళ్లాలన్నా నలుగురిని కూడగట్టుకొని ముందుకుసాగేవాడు. 1973-74లో బాబు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ స్టూడెంట్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యాడు. డిపార్ట్మెంట్లోనూ, కళాశాలలోనూ నిర్వహించే అన్ని కార్యక్రమాలనూ ప్రణాళికాబద్ధంగా అందరినీ కలుపుకుని నిర్వహించేవారు. డిపార్ట్మెంట్ ఛైర్మన్‌గా ఉంటూనే వివిధ నీటిపారుదల ప్రాజెక్టులు, పరిశ్రమల సందర్శనకు, విహార యాత్రలకు నాయకత్వం వహించి తీసుకెళ్లేవారు.

సిబ్బందికీ ఆర్థిక సాయం

యూనివర్శిటీలో హాస్టల్, మెస్ ప్రతినిధులను ఎక్కువ మందిని తన ప్యానల్లోని వారినే గెలిపించుకుని అత్యధిక మెజార్టీతో హాస్టల్, మెస్ జనరల్ సెక్రటరీగా బాబు ఎన్నికయ్యాడు. అనారోగ్యంతో బాధపడే విద్యార్థులను ఆస్పత్రులకు తీసుకెళ్లేవాడు. ఎంతోమంది నాలుగోతరగతి సిబ్బందికి ఆర్థిక సహాయం అందించేవాడు.

పేద విద్యార్థులకు ఫీజులు కట్టేవాడు

కొందరు విద్యార్థులు సకాలంలో ఫీజులు చెల్లించలేకపోతే తానే ఫీజులు చెల్లించేవాడు. ఎక్కువ మందికి ఫీజులు చెల్లించవలసి వస్తే, తన మిత్రులను ఒప్పించి వారి దగ్గర నుండి పేద విద్యార్థుల ఫీజులు కట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. న్యాయం కోసం పోరాడే మనస్తత్వం చంద్రబాబుది. ఉపకారవేతనాలు సకాలంలో అందకపోతే తానే ముందుండి సోషల్ వెల్ఫేర్ ఆఫీసుకు వెళ్ళి, అక్కడి అధికారులతో చర్చలు జరిపి సకాలంలో ఉపకార వేతనం అందేటట్టు చేసేవాడు.

నడిపించే శక్తి

తాను ఎదగడమే గాక, తనలాగే సహచరులను తయారు చేయడమనేది సమర్థుడైన నాయకుని లక్షణం.ఆ కోవకు చెందిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు. గీతానాథ్ అనే బీసీ విద్యార్థిని విశ్వవిద్యాలయ విద్యార్థిసంఘం అధ్యక్షుడి గానూ, మోహన్ అనే కాపు నాయకుడిని కార్యదర్శిగానూ ముందుండి గెలిపించాడు. తరువాతి కాలంలో గీతానాథ్ అకడమిక్‌గా, మంచి అడ్మినిస్ట్రేటర్‌గా ఎదిగాడు. మోహన్ తిరుపతి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేశాడు.

పీహెచ్‌డీ చేస్తుండగానే రాజకీయాల్లోకి

ప్రొఫెసర్ డీఎల్ నారాయణ నేతృత్వంలో పీహెచ్‌డీ చేస్తుండగానే 1976లో చంద్రబాబు రాజకీయ రంగప్రవేశం చేశాడు. పులిచెర్ల సమితికి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు.

- విభిన్న సామాజిక వర్గాలకు చెందిన వారు ఆయన స్నేహితులుగా ఉండేవారు. తొండవాడ గిరిధర్ రెడ్డి, రంగంపేట సుబ్బరామిరెడ్డి, విక్టర్, పీఎస్ మునిరత్నం, షరీఫ్, కరీం వంటివారు అయనకు దగ్గరగా ఉండేవారు.
- చదువుకునే రోజుల్లోనే చంద్రబాబు చుట్టుపక్కల గ్రామాలలో సమస్యలను ఓర్పుగా, నేర్పుగా పరిష్కరించి పోలీసు స్టేషన్లకు, కోర్టులకు వెళ్ళకుండా రాజీ చేసేవాడు.
- 1977నవంబరు19న దివిసీమను ఉప్పెన మింగేసింది. అప్పుడు చంద్రబాబు తన మిత్రులను కూడగట్టుకుని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యటించి నగదుతో పాటు, ధాన్యాన్ని, వస్త్రాలను సేకరించి నేరుగా దివిసీమకు వెళ్ళి అందజేశాడు.
- యువత దగ్గర 'వరకట్న నిషేధిత ప్రతిజ్ఞ' పత్రాలను సేకరించి వాటిని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుకు సమర్పించి అభినందనలను పొందాడు.
- ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా గ్రామాల్లోని ప్రజలను సంఘటితం చేసి శ్రమదానంతో రహదారులను నిర్మించి, నీటికాలువలను ఏర్పరచి చెరువులకు నీటిని మళ్ళింపజేసిన ఘనత ఆయనది.

చదువులో యావరేజ్.. ఆలోచనలు ఇంటెలిజెంట్

- చంద్రబాబు టీచర్ మునిరత్నం నాయుడు
- బాబు ఆర్థిక సంస్కరణలకు బీజం పీజీలోనే!

చంద్రబాబుకు ఎంఏలో గురువు ప్రొఫెసర్ కె.మునిరత్నం నాయుడు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 1972-74లో చంద్రబాబు ఎంఏ ఎకనామిక్స్ చేశారు. రీసెర్చ్‌స్కాలర్‌గా ఉంటూ ఇండస్ట్రియల్ ఎకనమిక్స్‌ను ఈయన బోధించేవారు. 2014లో మునిరత్నం నాయుడు ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా కూడా చేశారు. పీజీ విద్యార్థిగా చంద్రబాబు వ్యక్తిత్వ వికాసాన్ని 'ఆంధ్రజ్యోతి'తో ఇలా పంచుకున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పీహెచ్‌డీ గైడ్‌తో చర్చలు

చదువులో ఫస్ట్ క్లాస్ స్టూడెంట్ కాకపోయినా, అతని ఆలోచనలు చాలా ఇంటలిజెంట్‌గా ఉండేవి. పీజీ తర్వాత ప్రొఫెసర్ డీఎల్ నారాయణ మార్గదర్శకత్వంలో చంద్రబాబు పీహెచ్‌డీలో చేరారు. డీఎల్‌తో గంటలకు గంటలు చర్చలు చేసేవాడు. నేను వారిద్దరి సంభాషణ వింటుండేవాడిని. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ ఆ సమయంలో ఎస్వీయూలో పనిచేశారు. ఆయనతోనూ చంద్రబాబు సన్నిహితంగా ఉండేవారు. సీఎంగా చంద్రబాబు దార్శనికత లోకానికి తెలుసు. దానికి బీజం విద్యార్థి దశ నుంచే పడిందని నాకు అనిపిస్తుంది. నాయకత్వ లక్షణాలు, అభివృద్ధి అవకాశాల గురించిన ఆలోచనలు ఆయన అప్పట్లోనే అందరితో మాట్లాడేవాడు.

ఒబీడియంట్ స్టూడెంట్

చంద్రబాబు క్రమం తప్పకుండా క్లాసుకు హాజరయ్యేవారు. చాలా ఒబీడియంట్ స్టూడెంట్. ఎవరైనా లోకటివ్వుతున్నారని వైస్ ఛాన్సలర్ దృష్టికి వెళితే టీసీ ఇచ్చి ఇంటికి పంపించేవారు. అయితే చంద్రబాబు పక్కన నలుగురైదుగురు ఫ్రెండ్స్ ఎప్పుడూ ఉండేవారు. విద్యార్థి సంఘ నాయకుడిగా చురుగ్గా ఉండేవాడు.

ఎన్జీ రంగాపై పరిశోధన

పీజీ పూర్తవ్వగానే "వ్యవసాయ రంగం అభివృద్ధి-ఎన్జీ రంగా కృషి' అంశంపై చంద్రబాబు పరిశోధక విద్యార్థిగా మారారు. కొంత డేటా నేను కూడా ఇచ్చా. పరిశోధన పూర్తి చేశారు. కానీ సబ్మిట్ చేయలేకపోయారు. నేను హెల్ప్ చేస్తానంటే వద్దన్నారు. అప్పటికే రాజకీయాల్లో బిజీ అయిపోవడం వలన దానిని పక్కన పెట్టేశారు.



కందులవారిపల్లికి చెందిన కొత్తపల్లి దేవరాజులు నాయుడు చంద్రబాబుకు సన్నిహిత బంధువు, మిత్రుడు. శేషాపురంలో ప్రైమరీ, చంద్రగిరిలో హైస్కూలు వరకూ ఇద్దరూ కలిసే చదువుకున్నారు. తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో కలసి డిగ్రీ చదివారు. అక్కడే హాస్టల్ రూములో కలసి వున్నారు. హాస్టల్ నుంచీ బయట వచ్చేశాక కూడా తిరుపతిలో విడిగా రూము తీసుకుని ఇద్దరూ వున్నారు. చంద్రబాబు తొలి ఎన్నికల్లోనూ వెంట వుండి పనిచేశారు. అగ్నిమాపక శాఖలో ఉద్యోగం చేసి రిటైరయ్యాక ప్రస్తుతం కందులవారిపల్లిలోనే నివాసం వుంటున్నారు. చంద్రబాబుతో ఆయన జ్ఞాపకాలు.....

టెన్త్ ఫెయిల్

చంద్రగిరిలో ఇంగ్లీషు మీడియం చదవడం కష్టమై చంద్రబాబు టెన్త్‌లో ఫెయిలయ్యాడు. తిరుపతిలో టంగుటూరి ప్రకాశం పంతులు మున్సిపల్ హైస్కూల్లో తెలుగు మీడియంలో మళ్ళీ టెన్త్‌లో చేరాడు. దాంతో నాకంటే ఒక సంవత్సరం జూనియర్ అయ్యాడు. నేను తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ ఫస్టియర్ చదువుతుంటే చంద్రబాబు అక్కడే పీయూసీలో చేరాడు. మేమిద్దరం, చిత్తూరు అరగొండ సమీపంలోని పద్మనాభం నాయుడు. ముగ్గురం ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ హాస్టల్ రూమ్ నంబరు 102లో వుండేవాళ్ళం. ఆ రూమ్‌లో మా గోల భరించలేక హాస్టల్ వార్డెన్ రాజు సార్ రూమ్ ఖాళీ చేసి వెళ్ళిపొమ్మని ఆర్డరేశాడు. దాంతో రూమ్ ఖాళీ చేసి పొర్ల వీధిలో సొంతంగా రూము అద్దెకు తీసుకుని అక్కడే చదువుకున్నాం.

తొలి ఓటమి

ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదివేటపుడు బీఏ హెచ్ఈపీ గ్రూపు తీసుకున్నాడు చంద్రబాబు. సెకండియర్‌లో వుండగా ఫైన్ ఆర్ట్స్ సెక్రటరీగా పోటీ చేశాడు. ప్రత్యర్థి ఫైనలియర్ స్టూడెంట్ దీనదయాళ్. అయితే పోటీ చేసినాక ప్రచారం చేయకుండా గమ్మున వుండిపోయినాడు. దాంతో ఆ ఎలక్షన్‌లో ఓడిపోయినాడు.



చంద్రబాబు తొలిఎన్నికల కౌంటింగ్ రోజు జ్ఞాపకాలు ఇవి.
రాజకీయ నేపథ్యం లేదు. పేరు ప్రఖ్యాతులు లేవు.
ఉరకలెత్తే ఉత్సాహం.. అండగా నిలబడే స్నేహితులు తప్ప.
ఇల్లిల్లూ తిరిగి ఓట్లడిగాడు. ఉత్కంఠభరితంగా సాగిన ఓట్ల లెక్కింపులో
స్వల్ప ఆధిక్యంతో అయినా.. విజయం సాధించాడు. చంద్రగిరి అసెంబ్లీ ఎన్నికల్లో అదో చరిత్ర.
అనాటి జ్ఞాపకాలను ఇద్దరు సన్నిహితులు ఇలా పంచుకుంటున్నారు...

తొలి గెలుపు.. రెండు జ్ఞాపకాలు



ఆ రేత్రి కంటిమింద కునుకులేదు

మా సొంత చిన్నాయన కొడుకు చంద్రబాబు నాకంటే మూడేండ్లు చిన్నోడు. నన్ను చంద్రబాబు పెద్ద మేనమామ కనుమూరి దొరస్వామి నాయుడుకు ఇచ్చి చేసినారు. అన్నలదమ్ముల బిడ్డలం కదా అందరం కలిసే పెరిగినాము. చంద్రబాబు తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినపుడు మాది మామూలు రైతు కుటుంబం. ఆ పక్కన నిలబడింది చానా పెద్దోళ్ళు. పల్లిలో మగోళ్ళంతా చంద్రగిరికి కౌంటింగ్ కాడికి పోయినారు. ఊర్లో ఆడోళ్ళం వుండాము. రాత్రి 7.30 గంటలకు ఓట్లు లెక్క పెట్టేది అయిపోయింది. చంద్రబాబు గెలిచినాడని మాకు రాత్రి 8 గంటలకు తెలిసింది. మేము ఆ దినం బెల్లం గానుగ ఆడతా వుండాము. మూడు పెనాలు దించినాము. నాలుగో పెనం దించకుండానే వదిలేసి చెరకు తోటలో నుంచీ పల్లిలోకి పరిగెత్తుకుంటా వచ్చినాము. ఎవ్వరి నోట్లో విన్నా మావోడు ఎమ్మెల్యేగా గెలిచిపోయినాడబ్బా.. అనే మాటే. అంత రాత్తిరిలో పూలు పెరక్కచ్చే దానికి పరిగెత్తినాము. గెలిచినాక చంద్రబాబు చంద్రగిరి నుంచీ అట్నే కొండకు పోయి దేవునికి దండం పెట్టుకోని మళ్ళా చంద్రగిరికి వచ్చినాడు. రాత్రంతా ఆడ ఊరేగింపు జరిగింది. మరుసటి రోజు తెల్లారి ఇంటికొచ్చినాడు. గెలిచినాడని తెలిసినాక పల్లిలో అందరికీ ఒకటే సంబరం. రాత్రంతా ఎవ్వరికీ కంటి మింద కునుకు లేదు. మరసటి రోజు చంద్రబాబు జీపులో ఊర్లోకి రాగానే అందరం పూలు జల్లినాము. ఆ సంబరం, సంతోషం చెప్పలేము."

- కనుమూరి శిద్ధమ్మ
(చంద్రబాబు పెద్దనాన్న కుమార్తె), నారావారిపల్లి



గెలిచినావు అని చెప్పినా నమ్మలేదు!

1978లో తొలిసారి చంద్రబాబు ఎమ్మెల్యేగా పోటీ చేసినాడు. చంద్రగిరిలో కౌంటింగ్ జరగతా వుంది. జనతా పార్టీ క్యాండిడేట్ కొటాల పట్టాభి చౌదరి అప్పటికే బలమైన నాయకుడు. చంద్రగిరిలో కరణం చెంచుముని పిళ్ళై ఇంటి మిద్దె మీద రూమ్‌లో కౌంటింగ్ రోజు అందరం మకాం వేసినాము. ఒకో రౌండు అయిపోతావుంది. అన్ని రౌండ్లలో కొటాల పట్టాభి చౌదరికే మెజారిటీ వస్తావుంది. లాస్టుకు రెండు రౌండ్లు మిగిలినాయి. అప్పటికి చౌదరికి ఆరు వేలకు పైన మెజారిటీ వుంది. దాంతో ఇంగ గెలిచేది లేదని చంద్రబాబు నీరసపడిపోయినాడు. అట్నే రూములో పడుకునేసినాడు. పట్టాభి చౌదరి గెలిచేసినాడని అప్పటికే రెండు సార్లు వాళ్ళ మనుషులు టపాసులు కాల్చి జిందాబాద్‌లు కొడతా వుండారు. ఇంగోపక్క లారీలో మేకపోతులు, పొట్టేళ్ళు ఏసుకుని ఇంకొందరు తలకోనకు బయల్దేరి పోయినారు డిన్నరు పెట్టుకునే దానికి. మేమంతా డీలా పడిపోయి గమ్మున కూర్చుని వుండాం. లాస్టు రెండు రౌండ్లలో పట్టాభి చౌదరిని దాటి చంద్రబాబుకు మెజారిటీ వచ్చేసింది. 1250 ఓట్ల మెజారిటీతో చంద్రబాబు గెలిచినాడని చంద్రగిరి తాసిల్దారు నారాయణరావు అనౌన్స్‌మెంట్ ఇచ్చినాడు. పడుకోని వున్న చంద్రబాబును లేపి నువ్వు ఎమ్మెల్యేగా గెలిచినావు అంటే మొదుట నమ్మనే లేదు. యూత్ అంతా చంద్రబాబును భుజాల మీద ఎత్తుకోని రూము కాడ నుంచి తాసిల్దారు ఆఫీసు వరకూ ఊరేగింపుగా తీసకపోయినారు.

- కొత్తపల్లి దేవరాజులు నాయుడు,
కందులవారి పల్లె, చంద్రబాబు రూమ్మేట్



రాజులాయన జాతకం నిజమైంది

1968లో చంద్రబాబు ఎస్ఎస్ఎల్‌సీ. ఆ రోజు మా రిజల్టు వస్తుంది. హిందూ పేపర్లో వేస్తారు. ఆ పేపర్ కోసం 40-50 మంది పిల్లోల్లం అంతా కలిసి అర్థరాత్రి రేణిగుంట రైల్వే స్టేషన్‌కి చేరుకున్నాం. రైల్లో పేపర్ రాగానే అందరం ఎగబడి రిజల్టు చూసుకున్నాం. అందరం పాసైనాము. చంద్రబాబు నంబరు లేదు. ఇంటికాడ నాయిన ఏమంటాడో అని భయం చుట్టుకునింది. ఒగడే రైల్వే స్టేషన్ నుంచీ నడుచుకుంటా వెళ్ళిపోతావుంటే నచ్చజెప్పినాము. మార్కుల లిస్టు వచ్చినాక చూద్దాం అందులో పాసై వుండచ్చు కదా అని ధైర్యం చెప్పి తిరుపతికి పిల్చకొచ్చినాము. మరసటి నాడు వాళ్ళ నాయన కోప్పడితే వాళ్ళమ్మ నచ్చిచెప్పింది. అప్పట్లో పుత్తూరులో రాజులాయన జాతకం భలే చెప్పేవాడని పేరు. చార్జీలకు, ఖర్చులకు డబ్బిచ్చి వాళ్ళమ్మ మా ఇద్దరినీ పుత్తూరుకు పోయి జాతకం చూపిచ్చుకుని రమ్మని చెప్పింది. ఇద్దరం పుత్తూరుకు పోయినాం. రాజులాయన. చంద్రబాబు చేయి కూడా చూడకుండా మొగం చూసి 'నీకు ఇంక తిరుగే లేదు... నువ్వు చాలా పైకి పోతావు పో...' అనేసినాడు. మళ్ళ వారం పది రోజులకు మార్కుల లిస్టులు వచ్చినాయి. వాటిలో చూస్తే చంద్రబాబు 52 శాతం మార్కులతో సెకండ్ క్లాసులో పాసైనాడు.

బచ్చలి ఆరోగ్యానికి నెచ్చెలి

కారం, వగరు, తీపి ఈ మూడురుచులు కలగలసిన ఆకు కూర బచ్చలి. దీనిలో పాలకూరతో సమానమైన పోషకతత్వాలు ఉంటాయి. ఇది తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బాగా పెరుగుతుంది. భోజన కుతూహల గ్రంథంలో దీనిని పోతకి లేదా ఉపోదకీ అని పేర్కొన్నారు. ఈ బచ్చలిలో రెండు రకాలు ఉన్నాయి. ఆకుపచ్చ కాండం, ఆకుపచ్చ ఆకులతో ఉన్న బచ్చలిని బసెల్లా ఆల్బా అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. ఎర్రని కాండం, ముదురు ఆకుపచ్చ ఆకులు కలిగిన బచ్చలిని బసెల్లా రుబ్రా అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. దీని గింజలు ఊదా రంగులో ఉంటాయి. ఈ రంగును తెలుగు వారు బచ్చలిపండు రంగు అనే పిలుస్తారు.

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

చాలా మంది బచ్చలి కూర వేడి చేస్తుందని భావిస్తారు. కానీ ఇది వాతాన్ని, వేడిని- రెండింటినీ అదుపు చేస్తుంది. ఆయుర్వేద గ్రంథాల్లో బచ్చలి కూర వల్ల ప్రయోజనాలను వివరించారు. ఆ ప్రయోజనాలు..

- ఇది రక్తశుద్ధికి తోడ్పడుతుంది. ఎముకలకు పుష్టినిస్తుంది.
- అనేక రకాల స్త్రీ సమస్యలకు ఇది పరిష్కారం. సంతాన ప్రాప్తినిస్తుంది. గర్భాశయపోషకంగా పనిచేస్తుంది.
- బచ్చలి ఆకును నమిలితే నోటిపూతను నివారిస్తుంది. ఈ ఆకు రసంలో పసుపు కలిపి పెడితే గాయాలు త్వరగా మానతాయి. కాలిన గాయాలకు ఈ ఆకు రసం మందుగా పనిచేస్తుంది. ఈ రసాన్ని రాస్తే దురదలు తగ్గుతాయి.
- బచ్చలి కూరకు మూత్ర పిండాల్లో రాళ్లను కరిగించే స్వభావముంది.
- బచ్చలి కూరలో జిగురు పదార్థం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మలబద్ధకం ఉన్నవారు బచ్చలికూరను తింటే మంచిది.

• గంగరాజు అరుణాదేవి

రకరకాల వంటలు

తెలుగువారు కంద బచ్చలి కూరను అన్ని శుభ కార్యాల్లోనూ వండుతారు. ఇక బచ్చలికూరతో రకరకాల రుచికరమైన వంటలు చేసుకోవచ్చు.

- బచ్చలికూరలో నూనె వేసి తాలింపు వేసి మూత పెట్టి మగ్గనిస్తే మెత్తగా అవుతుంది. దీనిలో ఉడికిన కందిపప్పు లేదా పెసర పప్పు వేసి పప్పుగా చేసుకోవచ్చు.
- బచ్చలికూరను సన్నగా తరిగి దీనిలో శనగ పిండి లేదా మొక్కజొన్న పిండి కలిపి కొద్దిగా నూనె వేసి వేయిస్తే రుచికరమైన కూర అవుతుంది. దీనిలో కొందరు కొబ్బరి తురుము, నువ్వుపప్పు కూడా వేస్తారు.




- బచ్చలి కూరను సన్నగా తరిగి దానిని నూనెలో దోరగా వేయించాలి. ఆ తర్వాత దానిలో తాలింపు, కొద్దిగా చింతపండు వేయాలి. దీనిని మిక్సీలో వేసి రుబ్బి పచ్చడిగా కూడా చేసుకోవచ్చు.

దోసకాయ చేపల పులుసు

కావాల్సిన పదార్థాలు: చేప ముక్కలు- పావు కిలో, దోసకాయ ముక్కలు- ఒక కప్పు, నూనె- పావు కప్పు, ఆవాలు- పావు చెంచా, మెంతులు- పావు చెంచా, ఎండు మిర్చి- 4, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు- రెండు రెమ్మలు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, పసుపు- అర చెంచా, కారం- ఒక చెంచా, గరం మసాలా పొడి- ఒక చెంచా, టమాటా గుజ్జు- అర కప్పు, ఉప్పు- తగినంత, చింతపండు రసం- ఒక కప్పు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం: ముందుగా చేప ముక్కలను నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాత వీటిని ఒక గిన్నెలోకి తీసుకుని అందులో పావు చెంచా పసుపు, పావు చెంచా ఉప్పు, పావు చెంచా కారం వేసి చేత్తో కలపాలి.

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడిచేయాలి. తరవాత ఆవాలు, మెంతులు, ఎండు మిర్చి, కరివేపాకు, పావు చెంచా పసుపు, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా కలపాలి. ఇవన్నీ దోరగా వేగాక అర చెంచా ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత దోసకాయ ముక్కలు వేసి కలిపి మూతపెట్టి మగ్గించాలి. అయిదు నిమిషాల తరవాత ముప్పావు చెంచా కారం, గరం మసాలా పొడి వేసి కలపాలి. ఇవి కొద్దిగా వేగాక టమాటా గుజ్జు, చింతపండు రసం వేసి బాగా కలపాలి. అయిదు నిమిషాల తరవాత అర చెంచా ఉప్పు వేసి, రెండు గ్లాసుల నీళ్లు పోసి మరిగించాలి. తరవాత చేప ముక్కలు వేసి మూతపెట్టి మగ్గించాలి. ఆరు నిమిషాల తరవాత మూత తీసి కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ పులుసు వేడి వేడి అన్నంలోకి బాగుంటుంది.



జాగ్రత్తలు

- రోహు, కట్లా, శీలావతి, కొరమీను చేపలతో ఈ పులుసు చేసుకోవచ్చు. కానీ ముల్లు ఉండే రోహు చేపతో చేసిన పులుసు రుచికరంగా ఉంటుంది.
- దోసకాయ, చేప ముక్కలను మరీ మెత్తగా మగ్గించకూడదు.

వంటిల్లు

మనం దోసకాయలతో ఇగురు, పప్పు, ఆవకాయ... ఇలా ఎన్నో రకాలు చేస్తూ ఉంటాం. టమాటా, చిక్కుళ్లు లాంటివి చేర్చి రకరకాల కూరలు కూడా వండేస్తూ ఉంటాం. ఇవి కాక దోసకాయలతో మాంసాహార రుచులు కూడా ప్రయత్నించవచ్చు. దోసకాయలను విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసం ఈ వంటకాలు.

దోసకాయతో వెరైటీగా..



దోసకాయ వంకాయ పచ్చడి

కావాల్సిన పదార్థాలు

- దోసకాయ ముక్కలు- ఒక కప్పు, వంకాయ ముక్కలు- ఒక కప్పు, టమాటా ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- పన్నెండు, చింతపండు- నిమ్మకాయంత, కొత్తిమీర- ఒక చిన్న కట్ట, కరివేపాకు- రెండు రెమ్మలు, జీలకర్ర- ఒక చెంచా, అవాలు- పావు చెంచా, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, నూనె- నాలుగు చెంచాలు, పసుపు- పావు చెంచా, ఉప్పు- తగినంత, పచ్చిశనగపప్పు- ఒక చెంచా, మినప్పప్పు- ఒక చెంచా, ఎండు మిర్చి- ఒకటి, ఇంగువ- చిటికెడు

తయారీ విధానం

- స్టవ్ మీద గిన్నెపెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో అర చెంచా జీలకర్ర, కొద్దిగా పసుపు, పచ్చిమిర్చి ముక్కలు, వంకాయ ముక్కలు వేసి దోరగా వేపాలి. తరవాత టమాటా ముక్కలు, చింతపండు, కొద్దిగా ఉప్పు వేసి రెండు నిమిషాలు మగ్గించాలి. తరవాత అర కప్పు దోసకాయ ముక్కలు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. మిక్సీ గిన్నెలో వెల్లుల్లి రెబ్బలు, వేయించిన వంకాయ-టమాటా ముక్కల మిశ్రమం వేసి కచ్చాపచ్చాగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీయాలి. స్టవ్ మీద తాలింపు గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. ఇందులో అర చెంచా జీలకర్ర, ఆవాలు, ఇంగువ, కొద్దిగా పసుపు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, ఎండు మిర్చి, కరివేపాకు, కొత్తిమీర తరుగు, అరకప్పు దోసకాయ ముక్కలు వేసి కలపాలి. ఈ తాలింపు మిశ్రమాన్ని పచ్చడిలో వేసి బాగా కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. ఈ పచ్చడి అన్నంలోకి రుచిగా ఉంటుంది.



దోసకాయ...
పులుపు, తీపి కలగలసిన రుచిలో ఉంటుంది. ఇందులో ఐరన్, కాల్షియం, పొటాషియం లాంటి మినరల్స్‌తోపాటు ఎ, సి, కె విటమిన్లు కూడా పుష్కలంగా ఉంటాయి. దోసకాయను తరచూ తినడం వల్ల ఎముకలు బలపడతాయి. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీరానికి కావాల్సినంత తేమ లభిస్తుంది. చర్మం మృదువుగా బిగుతుగా మారుతుంది. రక్తపోటు, మూత్రపిండాల సమస్యలు తగ్గుతాయి. దోసకాయలో ఉండే కుకుర్బిటాసిన్ ... మూత్రాశయ క్యాన్సర్‌ను నివారిస్తుంది.

జాగ్రత్తలు

- దోసకాయను చిన్న ముక్కలుగా కోయాలి. పొడవాటి వంకాయలు తీసుకుంటే పచ్చడి రుచిగా ఉంటుంది.
- గ్రైండ్ చేసేటప్పుడు కొన్ని వేయించిన పల్లీలు వేస్తే పచ్చడికి కమ్మదనం వస్తుంది.
- ఈ పచ్చడిని రోట్లో చేస్తే రుచి అద్భుతంగా ఉంటుంది.

దోసకాయ చికెన్ కూర

కావాల్సిన పదార్థాలు

- చికెన్- 300 గ్రాములు, దోసకాయ ముక్కలు- ఒక కప్పు, ఉల్లిపాయ ముక్కలు- రెండు కప్పులు, పచ్చిమిర్చి- మూడు, కారం- ఒకటిన్నర చెంచాలు, ఉప్పు- ఒకటిన్నర చెంచాలు, పసుపు- అర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, ఎండుమిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ధనియాల పొడి- అర చెంచా, నూనె- మూడు చెంచాలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం

- ఒక గిన్నెలో చికెన్ ముక్కలు, అర చెంచా ఉప్పు, అర చెంచా కారం, అరచెంచా అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలిపి అరగంటసేపు నానబెట్టాలి.
- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, పసుపు వేసి దోరగా వేపాలి. ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. ఇవన్నీ వేగాక నానబెట్టిన చికెన్ ముక్కలు వేసి కలపాలి. గిన్నెమీద మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత దోసకాయ ముక్కలు, ఒక చెంచా కారం, ఒక చెంచా ఉప్పు, ధనియాల పొడి వేసి బాగా కలపాలి. అరగ్లాసు నీళ్లు పోసి మరో అయిదు నిమిషాలు మగ్గించాలి. చివరలో కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కూర రోటీ, చపాతీ, పుల్కా, వేడి అన్నంలోకి బాగుంటుంది.

జాగ్రత్తలు

- చికెన్ ముక్కలు మగ్గుతున్నప్పుడు అందులో ఒక గరిటెడు పెరుగు కలిపితే కూర రుచిగా ఉంటుంది.
- దోసకాయను పెద్ద ముక్కలుగా కోయాలి.



పర్సనల్ కేర్

చెవిలో పురుగు దూరితే..!

ఒక్కోసారి చెవిలోకి చీమలు, బొద్దింకలు లాంటి చిన్న చిన్న పురుగులు దూరి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. లోపలికి వెళ్లినంత సులువుగా అవి బయటికి రావు. వీటిని బయటికి రప్పించడానికి నిపుణులు చెబుతున్న చిట్కాలివి...

- చెవిలోకి ఏదైనా పురుగు ప్రవేశిస్తే వెంటనే చీకటి గదిలోకి వెళ్లి టార్చ్ లేదా మొబైల్ లైట్‌ను చెవిలో చూపించాలి. వెలుగును చూసిన వెంటనే కొన్ని రకాల పురుగులు బయటికి వచ్చేస్తాయి.
- చెవిలో ఆలివ్ నూనె లేదంటే బేబీ ఆయిల్ చుక్కలు వేస్తే ఆ నూనెతోపాటే పురుగు బయటికి వస్తుంది.
- గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ నీటిని చుక్కలుగా చెవిలో వేస్తే లోపలికి వెళ్లిన పురుగు బయటికి వచ్చేస్తుంది.
- ఆల్కహాల్‌లో చిన్న దూది ఉండను ముంచి దాన్ని చెవి రంధ్రం దగ్గర పెడితే ఆ వాటుకి పురుగు బయటికి వచ్చేస్తుంది. అలా రాని పక్షంలో ఒక చుక్క ఆల్కహాల్‌ని వేలితో తీసుకుని చెవిలోపల రాస్తే ఫలితం కనిపిస్తుంది.
- చెవిలోకి పురుగు దూరినప్పుడు బడ్స్, పిన్నీసు, అగ్గిపుల్ల, సూది లాంటి వాటితో దాన్ని బయటికి తీసే ప్రయత్నం చేయకూడదు. ఇలా చేస్తే చెవి నొప్పి పెరుగుతుంది.
- ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ పురుగు బయటికి రాకపోతే వెంటనే వైద్యుని సంప్రదించాలి.



సెలెబ్ టాక్



ఎప్పటికీ కొత్త కొత్త ఫ్యాషన్ పోకడలు పుట్టుకొస్తూనే ఉంటాయి. దాంతో పాత దుస్తులను బీరువాలకే పరిమితం చేసేస్తూ ఉంటాం. కానీ పాతబడిపోయిన పట్టు చీరలు, కుర్తాలకు కొత్త రూపాన్ని ఎందుకు ఇవ్వకూడదు? అని ప్రశ్నిస్తోంది బాలీవుడ్ తార, రచయిత్రి, ఇంటీరియర్ డెకార్ ఔత్సాహికవేత్త, ట్వింకిల్ ఖన్నా! పాత వస్త్రాలకు కొత్త హంగులు జోడిస్తూ, వాటికి ఇంటి అలంకరణలో చోటు కల్పిస్తున్న ట్వింకిల్ ఇంకా ఏమంటోందో తెలుసుకుందాం!

పాత వాటికి కొత్త కళ

"ఇంటికి పండుగ శోభ తీసుకురావడం కోసం అలంకరణ వస్తువుల మీద డబ్బును వృథా చేయవలసిన అవసరం ఏమాత్రం లేదు. దుకాణంలో కొనే ఖరీదైన అలంకరణ వస్తువులకు బదులుగా, ఇంట్లో ఉపయోగించకుండా భద్రపరిచిన వస్త్రాలను పునర్వినియోగించుకునే మార్గాల మీద దృష్టి పెట్టండి. పాత చీరలు, కుర్తాలు, దుపట్టాలతో ఒక గ్యాలరీని రూపొందించుకోండి. మన ఇంట్లో గోడలకు పెయింటింగ్‌లు, ఫొటోలను వేలాడదీస్తూ ఉంటాం. ఆకట్టుకునే వాల్ హ్యాంగింగ్స్‌ను తగిలిస్తూ ఉంటాం. ఇవన్నీ అందరి ఇళ్లలో ఉండేవే! కానీ వినూత్నంగా కనిపించడం కోసం కొంత సృజనాత్మకంగా ఆలోచించాలి.

పాత జ్ఞాపకాలు పదిలంగా...

మన పెళ్లి నాటి పట్టుచీరలు, బహుమతులుగా అందుకున్న పట్టు కుర్తాలు, సెక్విన్ వర్క్‌తో కూడిన లెహంగాలు, దుపట్టాలు లాంటివి మన బీరువాల్లో ఏళ్ల తరబడి మగ్గుతూ ఉంటాయి. పాతబడేకొద్దీ అవన్నీ పిగిలిపోయి, వాడుకోడానికి వీల్లేకుండా పాడైపోతూ ఉంటాయి. ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఆ వస్త్రాలతో ముడిపడి ఉంటాయి కాబట్టి వాటిని పారేయలేం. అలాగని వాడుకోలేం! ఇలాంటి మీమాంసకు చెక్ పెట్టి, వాటితో ఆకర్షణీయమైన వాల్ డెకార్ తయారు చేసుకోండి.



అంతులేనన్ని ప్రత్యామ్నాయాలు

పాత చీరలు, స్కార్ఫ్‌లు, కుషన్ కవర్లు, పాత దుపట్టాలను బయటకు తీసి, వాటికి మన పాత ఆర్ట్‌వర్క్స్ జోడించి కొత్త రూపాన్ని అందించాలి. అలాగే పాత వస్త్రాలను లెక్కలేనన్ని అవసరాలకు కూడా వాడుకోవచ్చు. వాటితో కుషన్ కవర్లు కుట్టుకోవచ్చు. టేబుల్ రన్నర్స్, ల్యాంప్‌షేడ్స్, కర్టెన్లు తయారుచేసుకోవచ్చు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీలను జోడించి, ఫ్రేమ్ కట్టించి గోడలకు తగిలించుకోవచ్చు. ఇలా పాత వస్త్రాలు, దుస్తులకు కొత్త కళను జోడించి వాడుకోవడం వల్ల పాత జ్ఞాపకాలను సజీవంగా ఉంచుకోవచ్చు. అలాగే దాంతోపాటు, ఇంటి అలంకరణ కూడా వినూత్నంగా మార్చుకోవచ్చు. మీరూ ప్రయత్నించి చూడండి."

మేకప్

ఎండల్లో చూడచక్కగా...

ఎండ వేడి, ఉక్కపోత పెరుగుతున్నాయి. కాబట్టి పాత మేకప్ సాధనాలకు స్వస్తి చెప్పి, వేసవికి తగిన వాటిని ఎంచుకోవాలి. అందుకోసం...

ప్రైమర్: గాల్లోని తేమ వల్ల చర్మరంధ్రాలు అవసరానికి మించి పని చేస్తూ స్వేదాన్నీ, చర్మపు సహజనూనె...సీబమ్‌నూ స్రవిస్తూ ఉంటాయి. దాంతో వేసవి మేకప్‌తో ముఖం జిడ్డుగా మారిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. మరీ ముఖ్యంగా ముక్కు, నుదురు, చుబుకాలకు ప్రైమర్ అప్లై చేసుకోవాలి.

పౌడర్: మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే చివర్లో పౌడర్‌తో సెట్ చేసుకోవాలి. ఫౌండేషన్ లేదా కన్‌సీలర్ పూసుకున్న తర్వాత, ముఖం మీద ముడతలు పడే వీలున్న ప్రదేశాల్లో తప్పనిసరిగా లూజ్ పౌడర్ ఉపయోగించాలి. బేకింగ్ అనే ఈ ప్రక్రియ వల్ల బేస్ మేకప్ ముఖానికి అంటుకుపోయి, ఎక్కువ కాలం చెదిరిపోకుండా నిలుస్తుంది.

ఫౌండేషన్: వేడికి మేకప్ కరిగిపోకుండా ఉండాలంటే, తేలికపాటి ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. ఫేస్ టింట్ కూడా వాడుకోవచ్చు. లైట్‌వెయిట్ ఆకృతి కలిగి ఉండే ఫౌండేషన్ ఎంచుకున్నా, ఫేస్ టింట్‌ను ఎంచుకున్నా వీలైనంత పరిమితంగానే వాడుకోవాలి.



మస్కారా: ఈ కాలంలో వాటర్‌ప్రూఫ్ మస్కారా వాడుకోవాలి. అలాగే కనురెప్పల కోసం సింగిల్ మెటాలిక్ ఐషాడోలనే ఎంచుకోవాలి. ఎండలో, ఉక్కపోతలో ఎక్కువ సమయం గడపవలసిన సందర్భాల్లో కారిపోకుండా ఉండే వాటర్‌ప్రూఫ్ ఉత్పత్తులనే ఎంచుకోవాలి.

లిప్ టింట్: టింట్ వల్ల పెదవులు సహజసిద్ధ మెరుపును సంతరించుకుంటాయి. టింట్ లేకపోతే, పౌడర్ బ్లష్, లిప్ బామ్‌లను సమపాళ్లలో కలుపుకుని లిప్ టింట్‌గా వాడుకోవచ్చు. బ్లష్ లేకపోతే దానికి బదులుగా లిప్ లైనర్ లేదా క్రీమీ లిప్‌స్టిక్‌ను కూడా వాడుకోవచ్చు.

ఆడపిల్లలు పుట్టారని...

భార్య, మామను చితకబాదిన భర్త




దెబ్బలుచూపుతున్న దామోదర్‌నాయుడు - చికిత్స పొందుతున్న దామోదర్‌నాయుడు, కోమల

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం ఆ దంపతులకు ఒక పాప పుట్టింది. ఆ తరువాత నాలుగు నెలల ముందు ఇద్దరు కవలలైన ఆడపిల్లలు పుట్టారు. ముగ్గురు ఆడపిల్లలను కంటావా అంటూ భర్త అప్పటి నుంచి భార్యపై ద్వేషం పెంచుకున్నాడు. ఈక్రమంలో సదరు భర్త వేరే మహిళతో సన్నిహితంగా ఉంటున్నాడు. దీనిపై ప్రశ్నించిన భార్యను, అడ్డువచ్చిన మామను కర్రతో చితకబాదాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని కైలాసగిరికాలనీలో శుక్రవారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. కైలాస గిరి కాలనీకి చెందిన దామోదర్‌నాయుడు ప్రైవేటు పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు. మూడో కుమార్తె కోమల డిగ్రీ పూర్తి చేసి పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేసేది. తొట్టంబేడు మండలం బోనుపల్లికి చెందిన తారక్‌రామ్ కారు డ్రైవర్. మూడేళ్ల క్రితం కోమలకు తారక్‌రామ్‌తో వివాహం జరిగింది. తొలి కాన్పులో బాలిక పుట్టింది. నాలుగు నెలల క్రితం తిరుపతి మెటర్నటీ ఆస్పత్రిలో ఇద్దరు కవలలు అయిన ఆడపిల్లలకు కోమల జన్మనిచ్చింది. దీంతో అప్పటి నుంచి భార్యతో తరచూ గొడవకు దిగేవాడు. రెండో కాన్పు తరువాత కోమల పుట్టింటికి వచ్చింది. ఇటీవల తారక్‌రామ్ మరో యువతితో సన్నిహితంగా మెలుగుతున్నాడు. దీనిపై భార్య, మామ శుక్రవారం తారక్‌రామ్‌ను ఫోన్‌లో ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన తారక్ కారులో అత్తింటి వద్దకు వచ్చాడు. మళ్లీ ఆడపిల్లలను ఎందుకు కన్నావంటూ వాగ్వాదానికి దిగాడు. మాటామాటా ముదరడంతో కర్రతో భార్య, మామను చితకబాదాడు. ఆపరేషన్ జరిగి కుట్లు వేసిన స్థానంలోనే తనను తన్నాడంటూ కోమల వాపోయింది. తండ్రితో కలిసి చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరింది. అంతకుముందు దాడి జరిగే సమయంలో నెం.100కు ఫోన్ చేయడంతో శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు కైలాసగిరికాలనీకి చేరుకున్నారు. పోలీసుల రాకతో యువకుడు పరారయ్యాడు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే సుధీర్ పరామర్శ



లీలావతి పాడె మోస్తున్న ఎమ్మెల్యే

రేణిగుంట, ఏప్రిల్ 18, (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడి సతీమణి పాడెను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మోశారు. కరకంబాడి పంచాయతీలోని గొల్లపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు పెద్దిశెట్టి శంకర్ సతీమణి లీలావతి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొల్లపల్లికి చేరుకొని ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. గ్రామస్థులతో కలిసి ఆమె పాడెను మోశారు. అనంతరం కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని తెలియ జేశారు. బుజ్జి నాయుడు, రాజేంద్ర, భాస్కర్ రెడ్డి, కోదండపాణి, భూపతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దర్గామిట్టలో టీడీపీ నాయకుడు యశ్వంత్‌కుమార్ తండ్రి పి.వెంకటేశ్వర్లు శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ అక్కడికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి రూ.20వేలు ఆర్థిక అందజేశారు. ఈ టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అరిగిలకండ్రిగలో తాగునీటికి కటకట



వ్యవసాయ బోరు నుంచి నీరు తెచ్చుకుంటున్న కాలనీవాసులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎస్‌పురం పంచాయతీలో అరిగిలకండ్రిగ గిరిజన కాలనీలో తాగునీటికి గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో 30 కుటుంబాలు వారు నివసిస్తున్నారు. వీరికి డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటిని అందిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం మోటరు మరమ్మతులకు గురికావడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో ఉన్న వ్యవసాయ బోర్ల వద్ద నీటిని తెచ్చుకుంటున్నామని గిరిజనులు తెలిపారు. మోటరును మరమ్మతులు చేయించాలని సర్పంచ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గిరిజనులు వాపోయారు. వేసవి నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి మోటరుకు మరమ్మతులు చేయించి తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా మురళీకృష్ణ



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా అయితా మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు అధ్యక్షుడు చిన్న రామ సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ... మహాసభ అభివృద్ధికి, అమరావతిలో భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆర్యవైశ్యులకు అవసరమైన సాయం అందజేస్తామన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా నరసింహుడి కల్యాణం



వడమాలపేట, 18 ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్‌రోడ్డు శంకరవనం సమీపంలో ఉన్న చెంచులక్ష్మి నరసింహస్వామి ఆలయంలో స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు శుక్రవారం ప్రధాన అర్చకుడు హేమంత్ ఆచార్య ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పట్టుపీతాంబరాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించారు. వేదమంత్రాలు, మేళతాళాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాంగళ్యధారణ గావించారు. మహామంగళ హారతులిచ్చి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ధర్మకర్తలు గురునాథం, శ్రీనివాస్, భాస్కర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అగ్ని ప్రమాదాలతో భారీ నష్టం

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు, పెట్రోల్ బంకుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ నేతాజీ చెప్పారు. చిన్నపాటి అగ్ని ప్రమాదం జరిగినా భారీ నష్టం వాటిల్లుతుందన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం నారాయణవనం మండలంలోని టాసా ఫుడ్స్ ఫ్యాక్టరీ, హెచ్‌పీ పెట్రోల్ బంకు, ఎల్పీజీ గ్యాస్ గోడౌన్ వద్ద అగ్ని ప్రమాదాల నియంత్రణ పట్ల అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు ఫైర్ ఇక్స్‌టింగ్విషర్ల పనితీరును పరిశీలించుకోవాలని నిర్వహణ సిబ్బందికి సూచించారు. ఈ క్రమంలో మంటలు చెలరేగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లీడింగ్ ఫైర్‌మన్ నాగేశ్వరరావు, డ్రైవర్ విశ్వనాథం శెట్టి అవగాహన కల్పించారు.

మహిళ వద్ద నగదు చోరీకి విఫలయత్నం

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జెండామాను వీధికి చెందిన మహిళ నుంచి రూ.2 లక్షల నగదును చోరీ చేసేందుకు దుండగుడు చేసిన ప్రయత్నం విఫలమైంది. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మహిళ తన 12 సంవత్సరాల కుమార్తెతో కాపువీధిలోని బ్యాంక్ ఆఫ్ ఇండియాకు వెళ్లి రూ.2 లక్షలు నగదు డ్రా చేశారు. బ్యాంకు నుంచి బయటకు వచ్చిన మహిళ వీపు భాగంలో గుర్తు తెలియని దుండగుడు మంట పుట్టించే రసాయనం చల్లారు. దీంతో ఆ మంటకు ఆమె అరుపులు వేయడంతో చుట్టుపక్కల వారు ఆమె వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో దుండగుడు బ్యాగ్‌ను లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆమె ఆ బ్యాగ్‌ను ఎంతకీ వదల్లేదు. కాగా, బ్యాగ్‌ను లాగే క్రమంలో గుమికూడిన వారు చూసి అతన్ని పట్టుకునే ప్రయత్నించారు. అతను తప్పించుకుని పారిపోయాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ ఓబయ్య సిబ్బందితో హుటాహుటిన అక్కడ చేరుకున్నారు. మహిళను ఆస్పత్రికి తరలించిన పోలీసులు ప్రథమ చికిత్స చేయించి ఇంటికి పంపారు. ఆమె ఎటువంటి ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదు. చుట్టుపక్కల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. అయినప్పటికీ దుండగుడు ఆచూకీ తెలియలేదు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

నేత్రపర్వం... సీతారాముల వసంతోత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలంపాళెంలో శుక్రవారం సీతారాముల వసంతోత్సవం కనులపండువగా జరిగింది. నవమి ఉత్సవాల్లో భాగంగా మందిరంలో ప్రతి రోజు పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. చివరి రోజు వసంతోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఓవర్ లోడ్‌ను అధిగమించేందుకు కొత్త సబ్‌స్టేషన్లు



ఆపరేషన్ సబ్ డివిజన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ తదితరులు

రేణిగుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ ఓవర్ లోడ్ సమస్యను అధిగమించేందుకు మూడు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శుక్రవారం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ సమీపంలో రూ.80 లక్షలతో నిర్మించిన ఆపరేషన్ సబ్ డివిజన్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో రెండు పారిశ్రామిక వాడలు ఉండడంతో విద్యుత్ వినియోగం అధికంగా ఉందన్నారు. దీంతో సరఫరాలో ఓవర్ లోడ్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి గాజులమండ్యంలో, కొత్త తహసీల్దార్ కార్యాలయం సమీపంలో, కృష్ణాపురంలో 130 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించేందుకు నెలాఖరులోగా స్థలాలను గుర్తిస్తామన్నారు. వ్యవసాయానికి 9 గంటలపాటు విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇక పై ట్రాన్స్‌ఫార్మర్లలో రాగికి బదులు అల్యూమినియం తీగలు వినియోగిస్తామని, రాగి వైరు కోసం ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టవద్దని దొంగలకు సూచిస్తూ చమత్కరించారు. తన పేరు చెప్పి పనులు చేయాలని టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తే తనకు ఫిర్యాదు చేయాలని ప్రభుత్వ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్‌ఈ సురేందర్ రెడ్డి, డీఈఈ చంద్రశేఖర్, డీఈ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

కేవీబీపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్చిల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువపై మరణించే ముందు ఆయన శాంతి సందేశాలను ఆదివారం ఈస్టర్ వరకు క్రైస్తవులంతా స్మరించాలని పాస్టర్లు సందేశాన్ని అందించారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలో గుడ్‌ఫ్రైడేను శుక్రవారం క్రైస్తవులు జరుపుకున్నారు. బీఎన్‌కండ్రిగ ఈసీఐ చర్చిలో పాస్టర్ జాన్‌వెస్లీ ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలను వివరించారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్చిల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు త్యాగాల్ని, శిలువ వేయకముందు ఆయన పడిన శ్రమ, శిలువ వేసిన తర్వాత క్రీస్తు పలికిన ఏడు మాటలను వివరించారు. పట్టణంలోని జెరూసలేం అపోస్టలిక్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే సుధీర్, టీడీపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తిరుపతి స్విమ్స్ సౌజన్యంతో నైస్ స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9నుంచి సాయంత్రం 3 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. గుండె, నరాలు, కిడ్నీ, డెంటల్, డయాబెటిస్, మహిళల సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిమూలం విచ్చేస్తారని తెలిపారు. స్విమ్స్ ఆస్పత్రి డైరెక్టర్, వీసీ ఆర్‌వీ కుమార్, నైస్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.మోహన్ ఆధ్వర్యంలో జరిగే ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శిబిర నిర్వాహకులు కోరారు.

నేడు మహాకుంభాభిషేకం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలటూరులో నూతనంగా నిర్మించిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ, అష్టబంధన, కుంభాభిషేక మహోత్సవం శనివారం జరగనుంది. ఈ వేడుకలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరు కానున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరు కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి కోరారు.

గంగమ్మ ఆలయ కుంభాభిషేకం

సత్యవేడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీపీపురంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయ కుంభాభిషేక వేడుకలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం యంత్ర ప్రతిష్ఠ జరిపించి గంగమ్మ, నాగాలమ్మ విగ్రహాలను గర్భ గుడిలో ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు. కలశ జలాలతో శిఖర గోపురాలను అభిషేకించారు. గ్రామంలోని భక్తులందరూ ఉదయం అమ్మవారికి అంబళ్ళు, సాయంత్రం పొంగళ్ళు నైవేద్యం పెట్టారు. చివరి రోజు ఎమ్మెల్యే ఆదిమూలం కుంభాభిషేక వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ



నారాయణవనం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేకపుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊంజల సేవను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్ కమిటీ ప్రమాణం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో కార్యాకారిణుల బాధ్యతల స్వీకరణ జరిగింది. జిల్లా అధ్యక్షుడు గల్లా సురేష్, కార్యదర్శి రవికుమార్ పాఠశాల నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కమిటీ మూడు సంవత్సరాలపాటు కొనసాగుతుందని చెప్పారు. సమితి అధ్యక్షుడు మంగిరెడ్డి, కమిటీ సభ్యులు, మాతాజీలు పాల్గొన్నారు.

ఉసురు తీసిన ఉపాధి గుంత: ఇంటర్ విద్యార్థిని మృతి



శ్రీవల్లి (ఫైల్‌ఫొటో)

వరదయ్యపాళెం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి గుంత ఇంటర్ విద్యార్థిని ఉసురు తీసింది. ఈ ఘటన వరదయ్యపాళెం మండలంలో జరిగింది. మండలంలోని కువ్వాకొల్లి పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన సుబ్రహ్మణ్యం, కామేశ్వరి కుమార్తె శ్రీవల్లి(16) గూడూరు పట్టణం దొడ్ల రమాదేవి మహిళా కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఒకేషనల్ కోర్సులో 343 మార్కులు సాధించింది. సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం ఐర్రెలను తోలడానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఉపాధిహామీ గుంతలో పడిపోయింది. ఈత రాకపోవడంతో మునిగిపోయింది. కూలీ పనులకు వెళ్లిన తలిదండ్రులు ఇంటి వచ్చిన తరువాత తమ కుమార్తె కనబడకపోవడంతో చుట్టుపక్కల ఇళ్లల్లో వాకబు చేశారు. శుక్రవారం ఉదయం ఉపాధి హామీ గుంతలో విగతజీవిగా తేలడంతో గ్రామస్తులు వెలికి తీశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకుని గుండెలవిసేలా విలపించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం లక్ష్మీపురానికి చేరుకుని శ్రీవల్లి మృతదేహానికి నివాళులర్పించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దశరథన్, నాయకులు నరసరాజు, ఆణిముత్యం నంద కిషోర్‌రెడ్డి తదితరులు కూడా నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. పట్టణంలోని పెద్ద మసీదు వద్ద ముస్లింలు నిరసన తెలిపారు. వీరికి వామపక్ష నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, శ్రీకాళహస్తి ప్రభుత్వ ఖాజీ, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న జగన్: టీడీపీ

మాజీ సీఎం జగన్ కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం మానుకోవాలని తిరుపతి పార్లమెంటు టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.సుబ్బయ్య హితవు పలికారు. వైసీపీని ప్రజలు మూలన పెట్టినా జగన్ తన ఉనికిని చాటుకోవడానికి మత రాజకీయాలకు తెరదీశారన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మరణాన్ని హత్యగా చిత్రీకరించి క్రిస్టియన్లను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారన్నారు. తిరుమలలో గోవులు చనిపోయాయంటూ మరో కుట్రకు తెరలేపారని చెప్పారు. వక్ఫ్‌బోర్డు బిల్లుపై పార్లమెంటులో ద్వంద్వ వైఖరి అవలంబించి ముస్లింలకు వెన్నుపోటు పొడిచారన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో వైసీపీ నాయకులు కుట్రలు చేయడం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు.

అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వం



సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి చిరునామాగా రాష్ట్రప్రభుత్వం నిలిచిందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. మండలంలోని చమర్తికండ్రిగ, మోటుపాళెం ఎస్టీకాలనీల్లో రూ.15 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలోనే అభివృద్ధిలో దూసుకుపోతుందని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. టీడీపీ నాయకులు పరమశివం, ఇళంగోవన్‌రెడ్డి, సుబ్రమణ్యం రాజు, పద్మరాజు, చిన్న, శశి, ధనశేఖర్, ఏఈ ఇబ్రహీంఖాన్, ఈవోపీఆర్డీ తరుణాక్ష రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా శుక్రవారం ఉత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని జిల్లా అగ్నిమాపక అధికారి జె.రమణయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఏర్పేడు మండలంలోని రాక్‌మెన్ పరిశ్రమలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. విద్యుత్తు, రసాయనాలు, హైడ్రోజన్, వర్నీష్ ఆయిల్ మంటలు చెలరేగినప్పుడు ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలని డెమో ద్వారా వివరించారు.



రేణిగుంట మండలం మర్రిగుంట గ్రామంలో సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా ఊరేగింపు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

వరదయ్యపాళెం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పీఎం యశస్వి ఎంట్రెన్స్ టెస్ట్ మెటీరియల్‌ను ఎస్‌వీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని సచివాలయం-1లో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. 8, 9, 10వ తరగతికి వెళ్తున్న విద్యార్థులకు ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారన్నారు. ఈ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి కేంద్రప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలు, కళాశాలల్లో, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచిత ప్రవేశం లభిస్తుందన్నారు. ఈ పథకం ఎస్సీలకు చెందిన పేద కుటుంబాలకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. మే 10న ఈ పరీక్ష ఉంటుందని చెప్పారు. వివరాలకు నెం. 8179923337, 9491022885లలో సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

గుండెపోటుతో ఆర్ఎంపీ మృతి



తంగవేలు (ఫైల్ ఫొటో)

పిచ్చాటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరువాయికి చెందిన ఆర్ఎంపీ తంగవేలు వెల్లైకారన్(50) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. తంగవేలు భార్య తేన్మొళి పిచ్చాటూరు జడ్పీటీసీ మాజీ సభ్యురాలు. తంగవేలు రాన్‌లో ఆర్ఎంపీగా చిరపరిచయస్తుడు.ప్రధాన పార్టీలకు చెందిన పలువురు నాయకులు తంగవేలు కుటుంబీకుల్ని పరామర్శించారు.

పాలసేకరణ కేంద్రం ప్రారంభం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): దికాళహస్తి సహకార పాల సరఫరా సంఘం ఆధ్వర్యంలో తొట్టంబేడు మండలం బసవయ్యపాళెంలో పాలసేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. దీంతో పలువురు పాడి రైతుల నుంచి పాలను సేకరించారు. పాడి రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల సరఫరా సంఘం అధ్యక్షుడు ఎం.మధుసూదన్, మాజీ అధ్యక్షుడు ముని రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ స్కిల్స్‌పై అవగాహన



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడిపాడులో నేతాజీ బాలల విద్యా సంఘం బాలలకు, యువతకు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రగతి కోఆర్డినేటర్ నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ శ్రీకాళహస్తి సమన్వయకర్త చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.